PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 221, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 01 - అక్టోబర్ - 2026 , వెల రూ.5/-



## కిటకిటలాడుతున్న తిరుమల గిరులు.. సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి 24 గంటల సమయం
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- మంగళవారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వైకుంఠం



## డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్..
## మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!

ఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాదని, అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం మిగతా 2 లో

- స్టార్‌లింక్‌ను తిరస్కరించిన డెల్టా ఎయిర్‌లైన్స్‌పై మండిపడ్డ మస్క్
- మస్క్ ప్రతిష్ఠపై సీఈవో ఎడ్ బాస్టియన్ చేసిన వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- ఈ నిర్ణయం వల్ల మీ ఉద్యోగం పోవడం ఖాయమంటూ సీఈవోకు మస్క్ వార్నింగ్
- స్టార్‌లింక్‌ను కాదని అమెజాన్ 'లియో' వైఫై కోసం డెల్టా ఒప్పందం

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు..
## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



- అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు
- క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత
- సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం
- ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి

# దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉంది

### ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం

- ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో నైపుణ్య శిక్షణ
- తాగునీటి సమస్యపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలి
- రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారు



అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకు మిగతా 2 లో



## నా ఆస్తులు రూ.1,400 కోట్లు, అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

- కేంద్ర మంత్రి కుమారస్వామికి డీకే కౌంటర్
- నిరాశతో తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శ
- సీఎంగా ఉన్నప్పుడు నైస్ ప్రాజెక్టుపై మౌనంగా ఎందుకున్నారని ప్రశ్న
- ఎలాంటి దర్యాప్తుకైనా తాను సిద్ధమని స్పష్టీకరణ
- బెదిరింపులకు, బ్లాక్‌మెయిల్లకు భయపడనని తేల్చిచెప్పిన శివకుమార్

కర్ణాటక : తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..

### కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం
- ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ



హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల మిగతా 2 లో



## రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం
- ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు
- అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు..
### సీఎం రేవంత్ రెడ్డి అభినందన



- ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు
- చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస
- ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత
- పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

# మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలి

### తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలి

- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నాం
- ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలి
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలి



హైదరాబాద్: : తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో జల్ శక్తి మంత్రి పాటిల్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు మిగతా 2 లో

## మహిళల కోసం భవిష్యత్తులో ఏపీ బస్సులు కొంటాం
### ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

- "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది
- 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం
- గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది



విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో మిగతా 2 లో

# సంపాదకీయం

## అసలు నకిలీ

మార్లిన్ మన్రో అంటే దాదాపుగా హాలీవుడ్ దేవత. జాన్ స్టెయిన్‌బెక్ ఏమో నోబెల్ గౌరవానికి నోచుకున్న నవలా రచయిత. సహజంగానే రచయితలకంటే నటీమణులకే క్రేజ్ ఎక్కువన్నది ఏ ప్రాంతానికైనా వర్తించే సత్యం కాబట్టి, అమెరికా కూడా అందుకు మినహాయింపు కాదు. స్టెయిన్‌బెక్ భార్య తరఫు మేనల్లుడైన ఓ 17 ఏళ్ల కుర్రాడు మార్లిన్ 'బానిస'. అలాంటివాడికి మార్లిన్‌ను స్టెయిన్‌బెక్ కలిశాడనే 'ఘోరమైనతప్పిదం' మేనత్త చేసిందట. ఆ కుర్రాడు దాన్ని నమ్మకపోయినా మామగారి పట్ల అతడి 'మర్యాద' ఆకాశాన్నంటింది. ఇక తప్పదన్నట్టుగా, ఆటోగ్రాఫ్ చేసిన ఒక ఫొటోను పంపమంటూ 1955లో న్యూయార్క్ నుంచి మార్లిన్‌కు ఓ లేఖ రాశాడు స్టెయిన్‌బెక్. భాష, శైలి, చమత్కారం వల్ల పదేపదే వైరల్ అయ్యే ఈ లేఖను ఈమధ్యే ప్యాట్రిక్ ఓషానెసీ అనే వ్యాపారవేత్త 'ఎక్స్'లో పంచుకున్నాడు. దీన్నే శశి థరూర్ ఓ నాలుగేళ్ల కింద షేర్ చేశాడు. అయితే, ఇందులోని శైలి స్టెయిన్‌బెక్‌దే అయినా, నిజంగా ఆయనే రాశాడనేందుకు ఆధారాలు లేవనే సందేహాలూ ఉన్నాయి. స్టెయిన్‌బెక్‌ది కాకపోతే స్టెయిన్‌బెక్ అంతటివాడు ఆవహించి రాసినదై ఉండాలి.

చరిత్రలో కొన్ని అబద్ధాలు ఎంత అందంగా ఉంటాయంటే అవి నిజమైతే బాగుండనిపిస్తుంది. ఒక మహానుభావుడి చేతిరాత కనిపిస్తే, ఒక నియంత రహస్య డైరీ దొరికితే, ఒక గొప్ప కవి ప్రేమలేఖ చేతికి చిక్కితే-- అవి నిజం కాదనే అనుమానమే అన్యాయంగా తోస్తుంది. అందుకే చరిత్రలోని కొన్ని మోసాలు కేవలం మోసాలుగా మిగిలిపోలేదు. సాహిత్యాన్నీ, జర్నలిజాన్నీ, పరిశోధననూ, మనుషుల ఊహాశక్తినీ పరీక్షించిన అద్భుతమైన కథనాలుగా మిగిలిపోయాయి. 1983లో జర్మన్ పత్రిక స్టెర్న్ 1932 నుంచి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ రాసినట్లుగా చెప్పిన దాదాపు అరవై సంపుటాల డైరీలు దొరికాయని ప్రకటించింది. యుద్ధం చివరి దశలో హిట్లర్ వ్యక్తిగత వస్తువులను తరలిస్తున్న విమానం కూలిపోవడంతో ఆ డైరీలు బయటపడ్డాయని కథనం. కానీ ఫోరెన్సిక్ పరీక్షలు కాగితం, సిరా రెండో ప్రపంచ యుద్ధం తర్వాతివని తేల్చాయి. కోన్రాడ్ కుజావు అనే చిత్రకారుడి సృజనాత్మక మోసం అలా బయటపడింది.

ముందు వాటిని అసలువని ఎందుకు నమ్మారు? అవి నిజమైతే బాగుండనే భావన మనుషులను అమాయకులను చేయడంవల్ల. ఇదే బలహీనత అబ్రహాం లింకన్ ప్రేమలేఖల ఉదంతంలోనూ కనబడుతుంది. 1928లో అమెరికా పత్రిక అట్లాంటిక్ మంత్లీలో 'లింకన్ ద లవర్' పేరుతో ఆన్ రట్లెడ్జ్‌కు లింకన్ రాసినట్టుగా చెప్పిన లేఖలు ప్రచురితమయ్యాయి. కానీ వాటి భాష, శైలి, ఆ కాలపు పదప్రయోగాలు అనుమానాస్పదంగా తోచాక రచయిత్రి విల్మా ఫ్రాన్సిస్ మైనర్ చేసిన సాహిత్య మోసం బయటపడింది. ఇక 18వ శతాబ్దం చివర్లో లండన్‌లో విలియం హెన్రీ ఐర్లాండ్ అనే కవి ఏకంగా షేక్‌స్పియర్ స్వహస్తాలతో రాసిన లేఖలు, అన్నే హాత్‌వేకి రాసిన ప్రేమలేఖలు, కింగ్ లియర్, హామ్లెట్ వంటి రచనల చేతిరాత ప్రతులతోపాటు షేక్‌స్పియర్ సరికొత్త నాటకం 'వాటిగెర్న్ అండ్ రొవెనా'ను 'కనుగొన్నాడు'. ఇంత కష్టపడి ఎందుకు నకిలీవి సృష్టిస్తారంటే దానికున్న మార్కెట్, సంచలన యావ, సరదా. అంతెందుకు, సాంస్కృతిక వారసత్వపు వెన్నువిరవకుండా భారతదేశాన్ని జయించలేమని ప్రచారంలో ఉన్న 1835 ఫిబ్రవరి 2 నాటి లార్డ్ మెకాలే ప్రసంగం కూడా ఉత్తిదేనని కథనాలు వెలువడ్డాయి. భావజాల పరంగా మెకాలే అలాంటివాడే కావొచ్చుగానీ ఆ లేఖ మీద మాత్రం వివాదం లేకుండా లేదు.

ఇప్పుడు ఇదంతా ఎందుకంటే, స్టీఫెన్ థేలర్ అనే ఏఐ పరిశోధకుడు 'ఎ రీసెంట్ ఎంట్రన్స్ టు ప్యారడైజ్' అనే చిత్రాన్ని డాబుస్ ఏఐ టూల్‌తో గీయించి, ఆ చిత్ర సృష్టికర్తగా దాన్నే అంగీకరించాలని పెట్టుకున్న కాపీరైటు అర్జీని భారత ప్రభుత్వ కాపీరైట్ కార్యాలయం ఇటీవలే కొట్టేసింది. దాన్ని ఒరిజినల్ వర్క్‌గా అంగీకరిస్తూనే, మానవ ప్రమేయం లేని ఈ కళకు కాపీరైట్ ఇవ్వడానికి తిరస్కరించింది. తనను సృష్టికర్తగా చెప్పుకోవడానికి థేలర్ అంగీకరించలేదు. కృత్రిమ నకిలీల కాలంలో ఆ మేరకు ఆయన సహజ అభినందనకు అర్హుడు.

## డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్.. మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!

ఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాదని, అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదానికి అసలు కారణం డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్, మస్క్ ప్రతిష్టపై చేసినట్లు చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు. ఒక కంపెనీ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతూ.. మస్క్‌తో కలిసి పనిచేయడానికి తాము ఇష్టపడటంలేదని బాస్టియన్ అన్నట్లు ఏవియేషన్ రిపోర్టర్ ఒకరు వెల్లడించారు. "మస్క్ ప్రతిష్ట గురించి మీకు తెలిసే, ఆయన గురించి బయట చెప్పేవన్నీ నిజాలే" అని బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఆ రిపోర్ట్ పేర్కొంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో మస్క్ దృష్టికి వెళ్లాయి. దీనిపై ఆయన ఘాటుగా స్పందించారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "ఈ నిర్ణయం వల్ల బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారు" అని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా డెల్టా కనెక్టివిటీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్టార్‌లింక్ కనెక్టివిటీ లేనందున, ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయాలంటే దాన్ని డెల్టా విమానంలో ఉంచడమే సరైన మార్గమని చురక అంటించారు. ఈ నిర్ణయం వల్ల డెల్టా గణనీయమైన సంఖ్యలో కస్టమర్లను కోల్పోవచ్చని ఆయన గతంలోనే హెచ్చరించారు. గత మార్చి నెలలో డెల్టా ఎయిర్‌లైన్స్, అమెజాన్‌తో బహుళ-సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 2028 నుంచి దశలవారీగా 500 విమానాల్లో అమెజాన్ 'లియో' శాటిలైట్ ఆధారిత వైఫై సేవలను ప్రారంభించనుంది. అయితే, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి అనేక ప్రత్యర్థి సంస్థలు ఇప్పటికే తమ విమానాల్లో వేగవంతమైన స్టార్‌లింక్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెల్టా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. అయితే, తమ నిర్ణయాన్ని డెల్టా సమర్థించుకుంటోంది. ఇది కేవలం వైఫై ఒప్పందం మాత్రమే కాదని, అమెజాన్‌తో తమకున్న విస్తృత భాగస్వామ్యంలో భాగమని స్పష్టం చేసింది. డెల్టా ఇప్పటికే తమ 600 అప్లికేషన్ల కోసం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' (ఏడబ్ల్యూఎస్)ను వినియోగిస్తోంది. భవిష్యత్తులో అమెజాన్ క్లౌడ్, రిటైలింగ్, ప్రైమ్ వీడియో, గేమింగ్ టెక్నాలజీ వంటి సేవలను కూడా ప్రయాణికులకు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. అయినప్పటికీ, డెల్టా నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. మస్క్ స్టార్‌లింక్ ఇప్పటికే వేలాది శాటిలైట్లతో ప్రపంచ స్థాయి నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా, అమెజాన్ 'లియో' ప్రాజెక్ట్ ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. స్టార్‌లింక్‌తో పోలిస్తే అమెజాన్ శాటిలైట్ల సంఖ్య చాలా తక్కువ. ఈ నేపథ్యంలో నిరూపితమైన టెక్నాలజీని కాదని, ఇంకా అభివృద్ధి దశలో ఉన్న వ్యవస్థను ఎంచుకోవడం సరైన వ్యూహం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, అమెజాన్‌తో భాగస్వామ్యం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని డెల్టా ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ టెక్ యుద్ధంలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో కాలమే నిర్ణయించాలి.

## వైఎస్ జగన్‌ను కలిసిన లంకపల్లి రైతులు

తాడేపల్లి : కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం, పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన రైతులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామ పరిధిలోని సుమారు 600 ఎకరాల లంక భూములకు సంబంధించిన తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు రైతులు. 1952 నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులైన తమను పక్కనపెట్టి, స్థానిక టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై టీడీపీ నాయకులు, వారి బినామీల పేర్లతో అనధికారికంగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ హక్కులను కాదని, రాజకీయ ప్రాబల్యంతో భూములను ఇతరుల పేర్లకు మార్చి వారి పేరుతో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారని వైఎస్ జగన్‌కు ఫిర్యాదు చేశారు సదరు రైతులు. లంక భూముల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని వైఎస్ జగన్‌ను కోరారు రైతులు. రైతుల సమస్యలను, వారి ఆవేదనను విన్న వైఎస్ జగన్.. వారికి అవసరమైన న్యాయ సహాయం పార్టీ తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఇండి కూటమి భేటీలో దేశ వ్యాప్తంగా నిరసనలకు నిర్ణయం

ఢిల్లీ: ఢిల్లీలో ఇండి కూటమి సమావేశంపై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల సంఘం పనితీరు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై చర్చించేందుకు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ సమావేశం జరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు ముసాయిదాను కూటమి చర్చించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండి కూటమి నేతలు జిల్లా, కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతాం. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం వరకు పాదయాత్ర నిర్వహిస్తాం. సంస్థలను ఏ విధంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి తెలియజేయడానికి ప్రతిపక్ష నాయకులు అందరం అక్టోబర్ రెండవ వారంలో కలవడానికి అపాయింట్‌మెంట్ కోరుతాం. అక్టోబర్-నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాము. ర్యాలీల తేదీలు, వేదికలను త్వరలోనే ఖరారు చేస్తాం. నవంబర్ 1న ఢిల్లీలో ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తాం. ఓటు చోరీపై రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ చెప్పే మాటలను ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు" అని తెలిపారు. కాగా, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించిన అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని ఇండి కూటమి నేతలు కోరుతున్నారు. కూటమిలో 21 పార్టీలు పాల్గొన్నాయి. గతంలో 23 పార్టీలుగా ఉన్న ఇండి కూటమి నుంచి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ సమావేశానికి దూరంగా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమావేశానికి హాజరుకావడం కాలేదు. ఆయన స్థానంలో ఎంపీలు హరేంద్ర మాలిక్, మొహిబుల్లా నద్వీ పాల్గొన్నారు. డీఎంకే సమావేశానికి దూరంగా ఉన్నప్పటికీ, జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంట్‌లో తొలగింపు తీర్మానం పెడితే మద్దతు ఇస్తామని ఆ పార్టీ ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ తెలిపారు.

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం.. కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?" అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

## కిటకిటలాడుతున్న తిరుమల గిరులు.. సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలి వరకు విస్తరించడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపిస్తున్నాయి. దర్శన టికెట్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు నిరంతరం సేవలందిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదం, మంచినీరు, పాలు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే 77,082 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టీటీడీ గణాంకాలు వెల్లడించాయి. వీరిలో 34,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లుగా నమోదైంది. భక్తుల రద్దీ దృష్ట్యా అందరూ సంయమనం పాటించి, క్షేత్రస్థాయి సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నా ఆస్తులు రూ.1,400 కోట్లు, అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

కర్ణాటక : తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘాటుగా స్పందించారు. తన ఆస్తులన్నీ చట్టబద్ధంగా సంపాదించినవేనని, ఆదాయపు పన్ను శాఖకు అన్ని వివరాలు వెల్లడించానని స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కుమారస్వామిపై ఎదురుదాడికి దిగారు. "అవును, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నాకు రూ.1,400 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అవన్నీ చట్టపరిధిలోనే సంపాదించాను. కుమారస్వామి నిరాశ, నిస్పృహలతో ఇలా మాట్లాడుతున్నారు" అని శివకుమార్ అన్నారు. బీజేపీ-జేడీఎస్ కూటమిలో నెలకొన్న అంతర్గత విభేదాలే కుమారస్వామి అసహనానికి కారణమని ఆయన ఆరోపించారు. నైస్ ప్రాజెక్టుపై కుమారస్వామిని శివకుమార్ నిలదీశారు. "ఆయన తండ్రి హెచ్.డి.దేవెగౌడ ఆ ప్రాజెక్టు ఒప్పందంపై సంతకం చేశారు. కుమారస్వామి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పుడు ఈ విషయంపై ఎందుకు మౌనంగా ఉన్నారు? గాంధీ అనే వ్యక్తికి టెండర్ కట్టబెట్టాలని ప్రయత్నించి, కోర్టుతో మొట్టికాయలు కూడా తిన్నారు. బినామీ పేర్లతో ఎన్నో లావాదేవీలు జరిగాయి. ఆయనలా నేను పేర్లు చెప్పాలనుకోవడం లేదు" అని విమర్శించారు. ఒక రైతు కుమారుడిగా, పారిశ్రామికవేత్తగా తాను ఆస్తులు సంపాదించడంలో తప్పేంటని శివకుమార్ ప్రశ్నించారు. "నాకు ఆస్తులు ఉండకూడదా? నా పిల్లలు ఆస్తులు కొనకూడదా? చట్టం అనుమతించిన మేరకే అన్నీ చేశాను. కుమారస్వామి ఏమైనా ఐటీ అధికారా? ఆయన దగ్గర సమాచారం ఉంటే ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వమనండి" అని సవాల్ విసిరారు. బెంగళూరు-మైసూరు ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (నైస్ రోడ్), బిడది టౌన్‌షిప్ ప్రాజెక్టుల పరిధిలో కుమారస్వామి, ఆయన కుటుంబ సభ్యులకు ఆస్తులు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. శోభా డెవలపర్స్‌లో రూ.5 కోట్లు పెట్టుబడి పెట్టి దాని విలువను రూ.2,000 కోట్లకు పెంచారన్న ఆరోపణలను కూడా శివకుమార్ తోసిపుచ్చారు. "దివంగత మాజీ సీఎం ఎస్.బంగారప్ప హయాంలో రూ.99,000కు ఒక స్థలం కొన్నాను. ఈ రోజు దాని విలువ రూ.20 కోట్లు. ఇందులో తప్పేముంది? నేను లంచం తీసుకున్నానా? ఏదైనా స్కామ్‌లో దొరికానా? అలాంటిదేమీ జరగలేదు. నాకు ఇలాంటి వందల ఆస్తులున్నాయి" అని వివరించారు. విధానసౌధ మెట్లపై చర్చకు రావాలన్న కుమారస్వామి సవాల్‌పై స్పందిస్తూ, చర్చ జరగాల్సింది అసెంబ్లీలో అని, కావాలంటే ఫ్రీడమ్ పార్క్‌లో బహిరంగ చర్చ పెట్టుకోవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా టోల్‌లను రద్దు చేయాలని ప్రధాని మోదీని కోరే దమ్ము కుమారస్వామికి ఉందా? అని ప్రశ్నించారు. "ఆరోపణలు పార్ట్ 1 మాత్రమేనన్న వ్యాఖ్యలకు, బెదిరింపులకు, స్టింగ్ ఆపరేషన్లకు భయపడను. స్వామీజీల ఫోన్లనే ట్యాప్ చేసిన వారు నన్ను వదులుతారా? ఆయన సీఎంగా ఉన్నప్పుడే నేను భయపడలేదు, ఇప్పుడు భయపడతానా? మా ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను వారు తట్టుకోలేకపోతున్నారు. అసూయకు మందు లేదు" అని శివకుమార్ అన్నారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల కమిషన్, ఈడీ వద్ద ఉన్నాయని, ఏ పెద్ద ఏజెన్సీతోనైనా దర్యాప్తు చేయించుకోవడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉంది

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లల్లో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని... రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక తాగునీటి సమస్యను నివారించే విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు పడడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో రెండు మున్సిపాల్టీల్లో కొద్దిపాటి తాగునీటి సమస్య ఉందని.. దాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక విశాఖ నగరంలో కూడా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అయిందని.. తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు పడ్డాయని నిర్లక్ష్యంతో ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

హైదరాబాద్: ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

## మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం

విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కొందరు నేతలు మీ భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్‌లు, పట్టాలు ఇస్తున్నాం. వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలి. మొన్న విశాఖలో, నిన్న మంగళగిరిలో నేడు విజయవాడలో పేదలకు పట్టాలు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేను. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం. దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లు. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదల చిరకాల వాంఛ నెరవేర్చాం. వారు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి. ఈ ఆస్తిని అమ్ముకోవద్దు, భవిష్యత్తు కోసం ఉంచుకోండి. 108 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయి. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం" అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలి

మొదటి పేజి తరువాయి

బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో జల్ శక్తి మంత్రి పాటిల్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ๐152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి ు కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని వివరించారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్తు వినియోగం, విద్యుత్తు వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు , గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు.

## రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు. ఏఐ ఆధారిత అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్‌టైమ్ ట్రాఫిక్ సమాచారం, ఆటోమేటెడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అందుబాటులోకి తెస్తారు. అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం కల్పించనున్నారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలను రియల్‌టైమ్‌లో గుర్తించి వేగంగా స్పందించేలా వ్యవస్థను రూపొందించనున్నారు. రాంగ్ రూట్, స్పీడింగ్, రెడ్‌లైట్ జంపింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలను టెక్నాలజీతో గుర్తించనున్నారు.

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం, 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ఆరు రబీ పంటల కనీస మద్దతు ధరలను (మీూ) పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కుసుమకు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.675, ఆవాలు-రాప్‌సీడ్‌కు రూ.413 చొప్పున పెంచింది. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 పెంపు లభించింది. పెరిగిన ధరలతో గోధుమ మీూ రూ.2,610, శనగ రూ.5,958, మసూర్ రూ.7,390, ఆవాలు రూ.6,613, కుసుమ రూ.7,215, బార్లీ రూ.2,286కు చేరింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యమని కేంద్రం వెల్లడి. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు కేంద్ర కేబినెట్ ఆమోదం. రూ.1,86,405 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌లోకి అనుసంధానం. 50 గిగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు . 2032-33 ఆర్థిక సంవత్సరం నాటికి పథకాన్ని పూర్తి చేయాలని లక్ష్యం. కేంద్ర ఆర్థిక సాయం రూ.54,082 కోట్లు. విద్యుత్ ప్రసార ఖర్చులను తగ్గించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగం పెంచేందుకు ఈ పథకం దోహదం.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు



రామ్మోహన్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ శాసనమండలికి త్వరలో జరగనున్న పట్టభద్రుల కోటా ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్ నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ఎంపిక చేశారు. వీరి ఎంపికకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు. ఈమేరకు ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. సామ రామ్మోహన్ రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా. ఈయన టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్‌గా, ముఖ్య అధికార ప్రతినిధిగా పని చేశారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, అలాగే యూత్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పని చేశారు. 2017లో లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా, 2019లో అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిది సూర్యాపేట జిల్లా. ఈయన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు. యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలోనూ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా వ్యవహరించారు. ఏఐసీసీ మెంబర్ అయిన సర్వోత్తమ్ రెడ్డి యూత్ కాంగ్రెస్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

## ముడి పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్**



ఏలూరు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతిపై ఉన్న సుంకాన్ని 16.5 శాతం నుండి 11 శాతానికి తగ్గించడం దేశ, రాష్ట్ర ఆయిల్ పామ్ రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపుపై వారుమాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 27 శాతం దిగుమతి సుంకాన్ని 16.5 శాతానికి తగ్గించిందన్నారు .ఇపుడు మళ్లీ 11 శాతానికి తగ్గించారని చెప్పారు. దేశీయ వంటనూనెల ఉత్పత్తిని అస్థిరపరిచి, వంటనూనెల విషయంలో దేశం స్వయం సమృద్ధి సాధించే లక్ష్యానికి విఘాతం కలిగించే తిరోగమన నిర్ణయం అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో వేరుశెనగ, నువ్వులు,ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పత్తి దిగుమతి పై ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని 11 శాతానికి ఇపుడు సున్నాకు తగ్గించారని చెప్పారు. ఫలితంగా లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న పత్తి రైతులకు మద్దతు ధరలు లభించలేదన్నారు.ఇపుడు నూనె గింజలు పండించే ఆయిల్ పామ్, వేరుశనగ, నువ్వులు తదితర పంటల రైతులు దివాళా తీస్తారని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముడి పామాయిల్ పై కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.25 వేలు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయిల్ పామ్ రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆలోచింపజేసిన ఇంగ్లీష్ ఎక్స్ పో



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: విద్యార్థులలో నిగూఢంగా ఉండే భాషానైపుణ్యాలు సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్ ను వెలికితీసేందుకు ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల ఇంగ్లీష్ విభాగం గురువారం నిర్వహించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎక్స్ పోను కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ప్రారంభించారు. భాషలో ఉండే పదాలు వాటి వాడుక లో ఉండే ప్రత్యేకతలు వాక్యనిర్మాణం లో ఉండే లయాత్మకత, భాషలోఉండే వ్యాకరణ అంశాలను 70 మంది వివిధ విభాగాల కు చెందిన విద్యార్థులు చార్టుల ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి, లాంగ్వేజెస్ సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ నర్సమ్మ, ఆర్ట్స్ కామర్స్ వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, ఎక్స్ పో కోఆర్డినేటర్ బంగారి,ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద విభాగ అధ్యాపకులు డా.ఎం.రాంబాబు,కె.రవికుమార్,సరిత,డా.విజయలక్ష్మి, శివాజి బి.కోటేశ్వరరావు, వివిధ విభాగాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్ పై వర్క్ షాప్




ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటో మెషిన్ వంటి సాంకేతిక తలకు ప్రాధాన్యత పెరుగుతోందని విద్యార్థులు పాఠ్యంశ పరిజ్ఞానంతో పాటు ప్రయోగాత్మక సాంకేతిక నైపుణ్యాలు లను పెంచుకోవాలని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా సూచించారు. గురువారం ఫిజిక్స్ విభాగాధిపతి డా.జె.అనిత అధ్యక్షతన రోబోటిక్స్ పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. సోహమ్ అకాడమీ సౌజన్యం తో రోబోటిక్స్ లో ఉపయోగించే పద్ధతులు వివిధ రంగాల్లో రోబోటిక్స్ అనువర్తనాలు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ పవన్ కుమార్ ప్రయోగాత్మక శిక్షణ అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏ ఎల్.ఎన్ శాస్త్రి, డా.ఏ నర్సమ్మ విభాగ అధ్యాపకులు ఎస్.రాంబాబు, డా.బి.శ్రీనివాస్, రాజశేఖర్,డా.కె.కిరణ్ కుమార్,డా.ధర్మయ్య ,వి.అనురాధ ,90మంది విద్యార్థులు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మ కరంగా మారునున్న ఖమ్మం జిల్లా ఐఆర్ సి ఎస్ ఎన్నికలు




ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు అక్టోబర్ 4 ఆదివారం టీటీడీసీ భవనంలో జరగనున్న ఈ మొత్తం 15 మంది పాలకవర్గ సభ్యులకు గాను 39 అభ్యర్థులు ఎన్నికల బరిలో తలపడుతున్నారు. మొత్తం 2430 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగుతోంది పోలింగ్ మిషన్ వెంటనే ఓట్ల లెక్కింపు ఫలితాలను విడుదల చేస్తారు. అనంతరం ఆఫీస్ బ్యానర్లను ఎన్నుకుంటారు. ఖమ్మం జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ 2010 లో 656 మందితో ప్రారంభించబడింది ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఏకగ్రీవంగానే కొనసాగుతోంది. ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బలిలోకి దిగి పోటీలో తలపడుతున్న రూ. ఈ సంస్థకు జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ఐ ఆర్ సి ఎస్ ముఖ్య ఉద్దేశం గ్రామీణ ప్రాంతాలలో మారుమూల ప్రాంతాలలో వైద్య సేవలను అందించడం పట్టణాలలో పల్లెలలో ప్రముఖ డాక్టర్లతో వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య శిబిరాలను నిర్వహించడం. వరదలు కరువు కాటకాలు విపత్కర పరిస్థితిలో ఎదురైనప్పుడు ఆహారం మందులు దుప్పట్లు దుస్తులు అందించడం, వివిధ ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు వైద్య సేవలు అందించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. గతంలో పనిచేసిన కమిటీ వారు విస్తృత సేవలను అందించే ఈ సంస్థ కార్యకలాపాలలో పాల్గొని ఈ సమస్య యొక్క పేరు ప్రఖ్యాతలు ఇనుమడింప చేయడమే కాక ఖమ్మం శాఖకు ప్రత్యేక గుర్తింపుని తెచ్చారు. అదే బాటలోనే సేవలను అందించాలని దృక్పథంతో పోటీ తత్వం ఏర్పడి ఎన్నికలు జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లా కు చెందిన పేరు ప్రఖ్యాతలు గడించిన వైద్యులు ఈసారి రంగంలో దిగారు. అంతేకాకుండా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం పోటీలో నిలబడి ఉన్నారు. పోటీన నిలబడిన వారిలో కొందరు అనేక సేవా కార్యక్రమా లలో లలో యూత్ కార్యక్రమాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అభివృద్ధిలో సేవలను అందిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు కూడా వారు వారి వారి ఆసుపత్రుల ద్వారా నిర్వహించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అందరూ ప్రముఖ స్వచ్ఛంద సంస్థలకు అధ్యక్షులు కార్యదర్శిగా ఉంటూ సేవను కూడా అందిస్తున్నారు. ఎవరు గెలిచినా సేవా తప్పరతే వారి ధ్యేయంగా చెప్పవచ్చు. ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ పేరు ప్రఖ్యాతలు మరింత చేస్తారని ఆశిద్దాం.

## విజయవాడలో భారీ మోసం, విశ్రాంత ఇంజినీరు రూ.10కోట్లు టోకరా



విజయవాడ, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీర్కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ.10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే భారీగా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడి పోయిన విశ్రాంత ఇంజినీర్ సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ.10 కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్ డిపాట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

## తెలంగాణ ఖమ్మం అర్బన్ సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్

**రేజోనెన్స్ శ్రీనివాస నగర్ విద్యార్థుల ఘన విజయం**




ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఖమ్మం మండల స్థాయిలో 29-09-2026న సర్దార్ పటేల్ స్టేడియం లో నిర్వహించిన సౌత్ మండల్ 70 వ ఎస్ జిఎఫ్ స్కూల్ గేమ్స్ లోనూ రేజోనెన్స్ విద్యార్థులు ప్రతిభ చూపి మండల స్థాయిలో సెలెక్ట్ అయ్యారు. ఈ పోటిలలో మా విద్యార్థులు అండర్ 17 విభాగంలో పవన్ కుమార్ కబ్బడి, అండర్ 17 విభాగంలో కృష్ణ చైతన్య, , ప్రశాంత్,శ్రావణ్ కుమార్ వాలి బాల్, అండర్ 14 కృష్ణ ప్రసాద్, జ్ఞానేశ్వర్ వాలి బాల్ పోటి లో సెలెక్ట్ అయ్యారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం అయిన డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, నీలిమా మాటాడుతూ ఇలాంటి విజయాలు మరెన్నో సాధించేలా ప్రోత్సహిస్తూ విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్థామని తెలియజేస్తూ విద్యార్థులశీదరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలతో సమావేశాల్లో పాల్గొనని అధికారులు

ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: మధిర మున్సిపాలిటీ పరిధిలో మెప్మా లో 162 సంఘాలు ఉండగా 22 వార్డులు ఉన్నాయి. 28 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. వీటన్నిటిని కలిపి ఒక టీఎంసీ గా ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల్లో ఎస్ ఎస్ జి ఎస్ ఎల్ ఎఫ్ టి ఎల్ ఎఫ్ సంఘాలు ఉంటాయి. ఎస్ ఎస్ జి సంఘాలకు మొదటి లీడర్ రెండవ లీడర్ ఉంటారు. ఇలాంటి సంఘాలను 15 సంఘాలను కలిపి ఎస్ఎల్ఎఫ్ గా ఏర్పాటు చేస్తారు. ఈ ఎస్ ఎల్ ఎఫ్ ను చూడటం కోసం ఒక ఆర్పిని ఏర్పాటు చేసి ఆ ఆర్పి ద్వారా ఎస్ ఎస్ జి సంఘాల్లో రుణాలు ఇప్పించడం జరుగుతుంది. దీనికి సంబంధించి పుస్తకాలు, చెక్కుబుక్కులు వీటి నిర్వహణ ఆర్పీలు చూసుకోవాలి. వీటికి సంబంధించిన పుస్తకాలు మొత్తం ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు దగ్గర ఉండాలి, కానీ ఇవన్నీ ఆర్పీలు దగ్గర ఉంచుకొని ఎస్-ఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గర సంతకాలు మాత్రమే ఆర్పీలు తీసుకుంటున్నారు. ఇలా రుణాలు ఇప్పించే సమయంలో తమకు నగదు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం ఎస్ఎల్ఎఫ్ సంఘాల సమావేశాలకు హాజరై ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో ఎటువంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రచారం చేయాలి, కానీ మధిర మున్సిపాలిటీ పరిధిలో సంఘాల సమావేశాలకు అధికారుల హాజరు కాకుండానే ఆర్పీలతోనే నడిపిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు తమకు పూర్తిస్థాయిలో సమాచారం అందటం లేదని ఆర్పీలకు అవసరమైన సమాచారం మాత్రమే అందిస్తున్నారని, మిగిలిన సమాచారం అందించడం లేదని పేర్కొంటున్నారు. ఆర్పీలు రుణాలు ఇప్పించే సమయంలో నగదు అడుగుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆర్పీలు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి మధిర మెప్మాలో రుణాలు తీసుకునే సమయంలో ఆర్పీలు తీసుకుంటున్న నగదు పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అనారోగ్యంతో చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన కల్కిభగవాన్

**– విషాదంలో భక్తులు – మూగబోయిన ఏకం క్షేత్రం**




అమరావతి, హైదరాబాద్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఏకం వ్యవస్థాపకులు కల్కి భగవాన్ (విజయ్‌కుమార్) (77) పరమపదించారు. ఆయన అనారోగ్య సమస్యలతో రెండు వారాలకు పైగా చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తన తండ్రి, ఏకం వ్యవస్థాపకులు శ్రీ భగవాన్ మహాసమాధి చెందారని ఆయన కుమారుడు కృష్ణానీ మంగళవారం రాత్రి ఓ వీడియో ద్వారా ప్రకటించారు. కల్కి భగవాన్ మరణంతో తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తలవల్లెలోని ఏకం క్షేత్రం మూగబోయింది. భక్తులు, భగవాన్ శిష్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. భగవాన్ పార్థివ దేహాన్ని బుధవారం ఉదయం బత్తలవల్లెలోని ఏకం క్షేత్రానికి తీసుకురానున్నారు. భక్తుల సందర్శనార్థం భగవాన్ పార్థివ దేహాన్ని బుధవారం ఉదయం 11.30 గంటల నుండి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు రోజులు ఏకం క్షేత్రంలో అంతిమ దర్శనం కోసం ఉంచనున్నట్లు కృష్ణానీ చెప్పారు. భక్తులందరూ ప్రశాంతంగా తరలివచ్చి దర్శనం చేసుకోవాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో సత్యవేడు సీఐ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

– వరదయ్యపాళెం కేంద్రంగా కల్కి భగవాన్ ఆధ్యాత్మిక ఉద్యమం

తిరుపతి జిల్లా వరదయ్యపాళెం కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఆధ్యాత్మిక ఉద్యమానికి కల్కి భగవాన్ (విజయ్ కుమార్ నాయుడు) 1984లో ప్రారంభించారు. తొలి దశలో చిత్తూరు జిల్లాలో ప్రత్యామ్నాయ విద్యా విధానం, పిల్లల్లో ఆత్మ పరిశీలన పెంపొందించే లక్ష్యంతో 'జీవాశ్రమం' అనే పాఠశాలను స్థాపించారు. 1990ల చివరలో తనను తాను విష్ణు మూర్తి పదో అవతారమైన 'కల్కి భగవాన్'గా ప్రకటించుకున్నారు. 1994లో జీవాశ్రమం ప్రాంగణాన్ని 'సత్యలోకం'గా మార్చి దీక్షలు, ఆధ్యాత్మిక సాధనలను ప్రారంభించారు. అనంతరం వరదయ్యపాళెం మండలం బత్తలవల్లెంలో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'వన్‌నెస్ టెంపుల్' (ప్రస్తుతం ఏకం) నిర్మితమైంది. దీని ద్వారా 'ఏకత్వ ఉద్యమం' (వన్‌నెస్ మూవ్‌మెంట్) దేశ విదేశాలకు విస్తరించింది. ప్రస్తుతం ఈ ఆధ్యాత్మిక సంస్థ కార్యకలాపాలను ఆయన కుమారుడు ఎన్‌కెవి కృష్ణ, కోడలు ప్రీతా కృష్ణ 'ఏకం' పేరుతో కొనసాగిస్తున్నారు.

## యువ క్రికెటర్లను గుర్తించడమే లక్ష్యం

**– గుంతకల్ మొదటి నుంచీ అభివృద్ధి చెందుతున్న కేంద్రం**

**– మచ్చా రామలింగారెడ్డి, చైర్మన్, ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ**

**– గుంతకల్‌లో ఆర్‌డిటి గ్రామీణ క్రికెట్ ప్రతిభాన్వేషణ: 151 మంది ఎంపిక**



గుంతకల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించడమే లక్ష్యంగా ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ లక్ష్యమని జిల్లాలో ఎంతోమంది ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లు ఉన్నారని వారికి జాతీయస్థాయిలో ఉత్తమ క్రికెట్ శిక్షణను అందించి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి క్రికెటర్లు చేయాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటకల్ పట్టణంలోని రైల్వే మైదానం నందు రూరల్ క్రికెట్ టాలెంట్ కార్యక్రమం బుధవారం జరిగింది. గుంతకల్ మొదటి నుంచీ అభివృద్ధి చెందుతున్న క్రికెట్ కేంద్రం అని ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి అన్నారు. బుధవారం గుంతకల్ రైల్వే గ్రౌండ్‌లో అండర్-15, అండర్-18 వయసుల వారికి ఆర్‌డిటి గ్రామీణ క్రికెట్ ప్రతిభాన్వేషణ నిర్వహించగా, మొత్తం 151 మంది క్రీడాకారులు నమోదు చేసుకుని ఎంపికకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రతిభను గుర్తించి, ఆర్‌డిటి అనంతపురంలోని ప్రత్యేక శిక్షకులచే వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇప్పటివరకు మేము రెండు జిల్లాల్లో 10 కేంద్రాలకు చేరుకున్నాము. ఇంతమంది యువ క్రీడాకారులు ఎంపికకు హాజరవడం చూసి మేము చాలా ఉత్సాహంగా, సంతోషంగా ఉన్నాము. ముఖ్యంగా గుంతకల్‌లో ఆట అభివృద్ధికి మాకు సహాయం చేస్తున్న గుంతకల్ రైల్వే విభాగానికి మేము ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. గుంతకల్‌లో గులాం, శశావళి, దాదా ఖలందర్, కామిల్, షోయబ్, సలీం మాలిక్ వంటి ఎంతో మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువ ఆటగాళ్లను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఆటగాళ్లు ఉప కేంద్రాలకు వచ్చి క్రమం తప్పకుండా సాధన చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి కోఆర్డినేటర్ కె. ప్రవీణ్, సీనియర్ ఆటగాడు దాదా ఖలందర్, సెలెక్టర్లు అహ్మద్ రఫీ, నరేంద్ర, విజయ్, ప్రశాంత్ రెడ్డి, ఏసీఏ కోచ్ షోయబ్, ఆర్‌డిటి కోచ్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొని ప్రతిభాన్వేషణను ప్రారంభించారు.



## 17 ఏళ్ల అనుబంధానికి వీడ్కోలు



పులిచెర్ల, సెప్టెంబర్ 30,(నేటి శుభోదయ) : మండల విద్యాశాఖ ఎంఆర్సీ కార్యాలయంలో 17 ఏళ్లపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా సేవలందించిన ఇంతియాజ్‌కు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల న్యాయశాఖలో కాపీయిస్ట్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందడంతో ఎంఆర్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆయనకు వీడ్కోలు పలికారు. మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించి, నూతన ఉద్యోగంలో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## ఎస్సీ, ఎస్టీ ల సమస్యలు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**రెవెన్యూ అధికారులు ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**



అనంతపురం, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ల సమస్యలు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో ఎస్సీ ఎస్టీల సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించి ఎస్సీలకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఎస్సీల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబందించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...రెవెన్యూ అధికారులు ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎంతోమంది ఎస్సీలకు చెందిన పేదలు వున్నారు వీరికి సంబంధించిన భూ సమస్యలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల వారీగా రివ్యూ నిర్వహించి ఎస్సీల భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. చిన్నచిన్న భూ సమస్యలు అధికారులు పరిష్కరించినట్లయితే బాధితులు ఎటువంటి గొడవలకు దిగే అవకాశం ఉండదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.... ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం అయినా తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు.పలువురు డివిఎంసి సభ్యులు మాట్లాడుతూ.... జిల్లాలో డప్పు కళాకారులకు ఇచ్చే విధంగా ఉరుముల కళాకారులకు కూడా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. నెలలో ఒకరోజు ఎస్సీ, ఎస్టీ పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలి. జిల్లాలో కొన్నిచోట్లఎస్సీలను దేవాలయాలలోకి ప్రవేశింపచేయలేదు ఈ సమస్య పరిష్కరించాలి. అంబేద్కర్ గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి. గ్రామపంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా నెల నెల జీతాలు ఇవ్వాలి. ఎస్సీ మహిళలు అత్యాచారానికి గురైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పరిహారం ఇవ్వాలని డివిఎంసి సభ్యులు కలెక్టర్ కు తెలిపారు.ఈ సందర్భంగా గత సమావేశంలో వచ్చిన అంశాలు యాక్షన్ టేకెన్ రిపోర్టుపై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ అధికారులు, డివిఎంసి సభ్యులు చిన్నపెద్దన్న, గడ్డం ముత్యాలప్ప, వెంకటేష్, తిరుపాల్, ముసలయ్య, కృష్ణమూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# రైతన్న పోరాటాలను తీవ్రతరం చేయండి

**ఏఐకేఎంఎస్ సంస్థను సంఘటిత పరిచి మరింత విస్తరింప చేయాలి**

ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 4వ జాతీయ మహాసభలు బుధవారం ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. గత జాతీయ మహాసభల నుంచి నేటి వరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలను వివరిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ వివరమైన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.దానిలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం సాగించిన పోరాటాల్లో ఏఐకేఎంఎస్ చురుకైన పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఢిల్లీ సరిహద్దుల్లో, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో సాగిన రైతాంగ ఉద్యమంలో ఏఐకేఎంఎస్ విస్తృతంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేసిందన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రైతాంగ ఉద్యమం సాధించిన విజయాన్ని ఆయన ప్రస్తావించారు.ఈ ఉద్యమం ద్వారా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో రైతాంగంతో ఏఐకేఎంఎస్ సంబంధాలు విస్తృతమయ్యాయని, సంస్థకు కొత్త ప్రాంతాల్లో పరిచయాలు ఏర్పడి ఉద్యమ విస్తరణకు మార్గం ఏర్పడిందని తెలిపారు. ఉద్యమ సందర్భంగా ఎదురైన అనుకూల, ప్రతికూల అనుభవాలను సమీక్షించుకొని భవిష్యత్ పోరాటాలకు వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

### - భూమి సమస్యపై నిరంతర పోరాటాలు

దేశవ్యాప్తంగా భూమి సమస్యపై ఏఐకేఎంఎస్ నిర్వహించిన పోరాటాలను నివేదికలో ప్రధానంగా ప్రస్తావించారు. బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో భూమిలేని పేదలు, రైతులు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీల భూమి సమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటిస్తూ అనేక రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో రైతాంగాన్ని, భూమిపై ఆధారపడిన ప్రజలను సమీకరించి పోరాడినట్లు కొన్ని విజయాలు సాధించినట్లు ఇది కిలో పేర్కొన్నారు. భూస్వాములు భూకబ్జా, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియాలకు వ్యతిరేకంగా కూడా ఉత్తర ప్రదేశ్ పంజాబ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో పోరాటాలు సాగినట్లు నివేదికలో పేర్కొన్నారు. పంజాబ్ లో దళితులకు భూమి సాధించేందుకు నిర్వహించిన పోరాటాలను, పోలీసుల నిర్బంధాన్ని, వందలకొద్దీ మూడు నెలలు జైల్లో గడిపిన విషయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.




### ఆదివాసీ ప్రాంతాల్లో కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు

ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ, అడవుల ఆక్రమణ, సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐకేఎంఎస్ వివిధ ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసిందని డాక్టర్ ఆశిష్ మిట్టల్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆదివాసీలను విస్తృతంగా సమీకరించి భూమి, అడవి, సహజ వనరుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ ప్రాంతాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా దీర్ఘకాలిక ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.

### ఎం ఎస్పి కోసం పోరాటం

రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల్లో ఏఐకేఎంఎస్ క్రియాశీలంగా పాల్గొన్నదని నివేదికలో పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తికి గిట్టుబాటు ధర, రుణభారం నుంచి విముక్తి, రైతుల జీవన భద్రత వంటి అంశాలను భవిష్యత్ పోరాటాల్లో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### ఎం జిఎన్ఆర్ఈజిఏ స్థానంలో విబి
### - జిఆర్ఏఎంజి కు వ్యతిరేకంగా ఉద్యమం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం జిఎన్ఆర్ఈజిఏ) ను బలహీనపరిచి, దాని స్థానంలో విబి - జిఆర్ఏఎంజి వంటి కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐకేఎంఎస్ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు నిర్మించిందని డాక్టర్ సతీష్ మిట్టల్ తెలిపారు.గ్రామీణ పేదలకు ఉపాధి హామీ, కూలీలకు పని దినాలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

### సంస్థాగత బలోపేతమే ముందున్న ప్రధాన కర్తవ్యం

గత కాలంలో జరిగిన పోరాటాల విజయాలను సమీక్షించుకోవడంతో పాటు, వాటి నుంచి సంస్థాగత నిర్మాణానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవాలని జాతీయ ప్రధాన కార్యదర్శి సూచించారు.

### సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయండి

సభ్యత్వాన్ని గణనీయంగా పెంచడం, ప్రతి గ్రామంలో సంఘాన్ని నిర్మించడం, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేయడం, రాష్ట్ర కమిటీలను మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దడం అత్యంత ప్రాధాన్యమైన కర్తవ్యాలని తెలిపారు.రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల వాస్తవ సమస్యలను గుర్తించి వాటిపై నిరంతర పోరాటాలు నిర్వహించడం ద్వారానే సంఘాన్ని విస్తృత ప్రజా సంస్థగా బలోపేతం చేయగలమని నివేదిక స్పష్టం చేసింది.గత పోరాటాల అనుభవాలను సమీక్షించుకొని, కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో బలమైన సంస్థాగత పునాదులను నిర్మించడమే నాల్గవ జాతీయ మహాసభల ముందున్న ప్రధాన లక్ష్యమని డాక్టర్ ఆశిష్ మిట్టల్ పేర్కొన్నారు.మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ నివేదికపై చర్చిలో పాల్గొని నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా వేములపల్లి వెంకటరామయ్య సుశాంత్ జై చలపతిరావు రవీందర్ సింగ్ తదితరులు వ్యవహరించారు.



## శ్రీ దసరా ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన
**.సి.యం నారా చంద్రబాబు నాయుడు**



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం లో నిర్వహించే శ్రీ దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారంసి.యం నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.అనంతరం దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య ముఖ్య మంత్రి కి ఆహ్వాన పత్రికను అందజేసి, మూలా నక్షత్రం రోజున శ్రీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ కార్యక్రమం గురించి వివరించారు.

## రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను బుధవారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు దేవాదాయశాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య తదితరులు అందజేసి శ్రీ అమ్మవారి దసరా ఉత్సవాలకు ఆహ్వానించారు.

## ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి. వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం తన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, సీతమ్మవారి పాదాలు, తుమ్మలపల్లి కళాక్షేత్రం, పాత ప్రభుత్వ ఆసుపత్రి, అజిత్‌సింగ్ నగర్, డాబాకోట్లు, మాకినేని బసవపున్నయ్య స్టేడియం తదితర ప్రాంతాలను సందర్శించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా, వినియోగానికి అనువుగా ఉంచాలని సూచించారు. తాగునీటి పాయింట్ల వద్ద నిరంతరం నీటి సరఫరా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మరుగుదొడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. నిర్మల గ్లోరీ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి గౌడ్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు నాయుడు

**- నూనెపల్లె అభివృద్ధికి కట్టుబడి ఉన్నా**
**- సమస్య మీది కాదు నాది పరిష్కారం అయ్యేంత వరకు వదలను**
**- ఈ రోజే మీ సమస్య పై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం**
**- గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నూనెపల్లె అభివృద్ధిని విస్మరించింది**
**- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీతో నూనెపల్లె అభివృద్ధి కమిటీ దీక్ష విరమణ**





నంద్యాల, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, నూనెపల్లె వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం తాను ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అవసరమైన నిధుల విడుదలకు పరిపాలన అనుమతి తీసుకున్నానని, నూనెపల్లె అభివృద్ధి విషయంలో మా మంచి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్య మీది కాదు నాది వాటిని పరిష్కరించేంత వరకు వదిలేదని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు.నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య ఆధ్వర్యంలో నూనెపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని రెండు రోజులుగా సామూహిక దీక్ష చేస్తున్నారు. బుధవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నూనెపల్లిలోని దీక్ష శిబిరం కు వచ్చి నూనెపల్లె అభివృద్ధికి, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కు ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని విషయాలు వివరించారు. తాను, మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ నూనెపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం ఇప్పటి వరకు చేసిన, చేపట్టబోయే అంశాలను నూనెపల్లె అభివృద్ధి కమిటీకి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. ఈ రోజే మరి కొద్దిసేపట్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన రైల్వే, మున్సిపల్, రెవిన్యూ, ఆర్ అండ్ బి తదితర అన్ని శాఖల అధికారులతో కీలక సమావేశం ఏర్పాటు చేసి, వాటి సమాచారం రేపటి లోగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు మీ సమస్య పరిష్కారం కోసం ఫైల్ వెళుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. చిన్న ఉద్యమం అయినా ఎంపీ డాక్టర్ శబరి వచ్చారన్నారు. ఇది చిన్నది కాదు, మీ కష్టం నాకు తెలుసు ఇదేళ్ల వైసీపీ పట్టించుకోలేదు. మీ బిడ్డగా తాను ఎంపీ అయిన రెండు నెలలకే ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి రెండేళ్ల క్రితం తీసుకొల్లా, సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలనీ కేంద్ర రైల్వే మంత్రి నీ, సీఎం చంద్రబాబును కోరా అన్నారు. ఎంపీ గా తాను, మంత్రి ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ బాగా స్పందించాం. ఈ రోజు అన్ని శాఖల అధికారుల సమావేశం ఏర్పాటు కు సీఎం చంద్రబాబు స్పందించారు రేపటి లోగా సీఎం ఆఫీస్ కు వెళుతుంది. మంత్రి ఫరూక్ నేను కలిసి మీ సమస్య పరిష్కరిస్తాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా నూనెపల్లె అభివృద్ధి కమిటీ పేరుతో చేస్తున్న మీ ఐక్యతకు అభినందనలనీ, మీ సహకారం మా ఉమ్మడి ప్రభుత్వం కు ఎంతో అవసరం పని కానప్పుడు దీక్షచేద్దాం. మీది కాదు ఇది నా బాధ్యత మీరూ దీక్ష విరమణ చేయండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరగానే ఒక్కసారిగా వందలాది మంది నూనెపల్లె ప్రజలు, ఉద్యమకారులు హర్ష ధ్వనాలతో ఆహ్వానించి, దీక్ష విరమించారు. దీక్ష శిబిరం నుంచి పక్కనే ఉన్న నూనెపల్లె రైల్వే అండర్ పాస్ వంతెన అవసరం అయ్యో రైల్వే ట్రాక్ ను ఉద్యమకారులతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు.



## అగ్ని ప్రమాద సమయంలో అప్రమత్తతే ప్రాణ రక్షణకు కీలకం.
## విద్యార్థులకు అవగాహన కల్పించిన వీఎంసీ ఫైర్ సిబ్బంది



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఫార్మాసిటికల్ కాలేజీలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై వీఎంసీ ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎఫ్ఓ సిహెచ్. రత్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాద సమయంలో విద్యార్థులు ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలి, సురక్షితంగా బయటకు ఎలా రావాలి అనే అంశాలను వివరించారు.ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం సంభవించి నప్పుడు విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా తాము ఉన్న ఫ్లోర్ నుంచి కేవలం మెట్ల మార్గం ద్వారా మాత్రమే కిందకు రావాలని సూచించారు. కిందకు వచ్చిన అనంతరం ఎక్కడపడితే అక్కడికి పరుగులు తీయకుండా అందరూ ఒక నిర్దేశిత సేఫ్ అసెంబ్లీ పాయింట్ వద్దకు చేరుకోవాలని తెలిపారు. ఇలా ఒకే ప్రాంతంలో అందరూ చేరినప్పుడు ఎంత మంది సురక్షితంగా బయటకు వచ్చారు, ఇంకా ఎంత మంది లోపల ఉన్నారనే విషయాన్ని సులభంగా అంచనా వేసి, లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు అగ్నిమాపక సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అగ్ని ప్రమాద సమయంలో భయాందోళనలకు గురై విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోతే ఎంత మంది బయటకు వచ్చారు, ఎంత మంది ఇంకా లోపల ఉన్నారనే విషయాన్ని ఖచ్చితంగా గుర్తించడం కష్టమవుతుందని తెలిపారు. అందువల్ల ప్రమాద సమయంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా, సమన్వయంతో వ్యవహరించడం ఎంతో ముఖ్యమని సూచించారు.అగ్ని ప్రమాదం సంభవించి నప్పుడు సమీపంలో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి, గదిలో పూర్తిగా పొగ వ్యాపించినప్పుడు నేలకు దగ్గరగా పాకుతూ సురక్షితంగా ఎలా బయటకు రావాలి, లిఫ్ట్‌ను ఎందుకు ఉపయోగించకూడదు, మెట్ల మార్గం ద్వారానే ఎందుకు బయటకు రావాలి, అగ్ని ప్రమాద సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటి అంశాలపై విద్యార్థులకు ఫైర్ సిబ్బంది వివరాత్మకంగా అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించే విధంగా మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను ప్రదర్శించారు. విద్యార్థులు కూడా మాక్ డ్రిల్‌లో పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటపడే విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్ఎఫ్ఓ నరేష్, వీఎంసీ ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆసుపత్రులకు అవగాహన



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం గవర్నర్‌పేటలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నగరంలోని ఆసుపత్రుల యాజమాన్యాలకు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 200కు పైగా ఆసుపత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేర్వేరుగా సేకరించి, నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం పసుపు, ఎరుపు, నీలం, నలుపు రంగుల చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పసుపు రంగు బిన్‌లో శరీర అవయవాలు తదితర బయోమెడికల్ వ్యర్థాలు, ఎరుపు రంగు బిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, సిరంజీలు తదితర వ్యర్థాలు, నీలం రంగు బిన్‌లో గాజు, సంబంధిత వ్యర్థాలు, నలుపు రంగు బిన్‌లో సాధారణ వ్యర్థాలను వేరు చేయాలని సూచించారు. నలుపు రంగు బిన్‌లోని సాధారణ వ్యర్థాలను కూడా విజయవాడ నగరపాలక సంస్థకు అందించే ముందు తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి అందించాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. శ్రీనివాసరావు, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ టి. అనిరూప్, సేఫ్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాభిషేకం.. పేదల సొంతింటి కల సాకారం
**లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు**




విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో బుధవారం నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన మహిళలకు ముఖ్యమంత్రి వేదికపై ఇళ్ల పట్టాలను అందజేశారు.అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వారికి ఆస్తిపై శాశ్వత హక్కు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు 5 వేల మందితో ఘన స్వాగతం పలికిన బుద్ధా వెంకన్న



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):-విజయవాడ పశ్చిమలోని వినాయకుని గుడి వద్ద బుధవారం నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరైన సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో సుమారు 5000 మంది ప్రజలు, పార్టీ శ్రేణులతో ఘన స్వాగతం పలికారు. సి.యం నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమానికి చేరుకున్న సమయంలో పశ్చిమ నియోజకవర్గం మొత్తం పసుపుమయం కాగా, భారీగా తరలివచ్చిన ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలతో స్వాగతం పలికారు. బుద్ధా వెంకన్న నాయకత్వంలో భారీ జన సమీకరణతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు భూమిపై హక్కు కల్పించే దిశగా పట్టాల పంపిణీ కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత కలిగిందని, ప్రజలకు సొంత స్థలం, సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలకు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వెంకన్న అన్నారు.

## ఏపీఐఐసీ కాలనీ రైతుబజర్‌లో రూ.35లకే కేజీ ఉల్లిపాయలను అందచేసే కౌంటర్లను ప్రారంభించి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 30 (నేటి శుభోదయ):- పేదలకు ఉరటనిచ్చేలా అన్ని రకాల చర్యలను తమ కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. బుధవారం ఉదయం తూర్పు లోని ఏపీఐఐసీ కాలనీలో ఉన్న రైతు బజర్ ఆవరణలో కేజీ ఉల్లిపాయలను రూ.35లకు విక్రయించే కౌంటర్లను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ఉల్లిపాయల ధరలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.75 పలుకుతున్న ఉల్లిపాయలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేవలం రూ.35లకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లలో విక్రయిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో మొబైల్ కౌంటర్లు, మినీ లారీల ద్వారా నేరుగా ప్రజల వద్దకే ఉల్లిపాయలను తక్కువ ధరలకు విక్రయిస్తామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలు, ఎల్‌నినో ప్రభావం కారణాలతో ఉల్లిపాయాల ధరలు పెరిగాయన్నారు. నాగ్‌పూర్ నుండి అవసరమైన స్టాక్‌ను తెప్పించేందుకు నేషనల్ కన్స్యూమర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ సహకరించిందన్నారు. రోజుకు 150 మెట్రిక్ టన్నుల ఉల్లిపాయాల రవాణాకు ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన సరుకును పేదలకు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేవలం ఉల్లిపాయలే కాకుండా రాబోయే రోజుల్లో కందిపప్పు, పామ్ ఆయిల్, పంచదార, గోధుమ పిండిని కూడా రాయితీ ధరలకు, కొత్తగా ఏర్పాటు చేయబోయే 1000 మినీ మార్టుల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుని అన్నారు. నగరంలోని 26 వేల మంది పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ళ పట్టాలను అందజేస్తున్నామని, ఇది నిజంగా పేదలకు పండుగ వాతావరణం అని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పేద ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఇప్పుడు ఉల్లిపాయలను కేజీ రూ.35లకే అందచేస్తున్నామన్నారు. గతంలో బియ్యం ధరలు పెరుగుతున్న సమయంలో తక్కువ ధరకు బియ్యాన్ని తీసుకువచ్చి వినియోగదారులకు అందచేశామన్నారు. మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాలను మంత్రివర్గ ఉపసంఘంగా ఏర్పడి చర్చించుకుని అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ నాణ్యమైన ఉల్లిపాయలను తీసుకురావాలని మంత్రి అధికారులను ఆయన ఆదేశించారన్నారు. పేదలకు పూర్తి స్థాయి హక్కులతో పేదలకు పట్టాలను అందచేస్తున్నామని చెప్పారు. దసరా, దీపావళి, రంజాన్ ఒకే సారి వస్తే ఎంత ఆనందంగా ప్రజలు ఉంటారో అలాంటి ఆనందమైన రోజు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, టీడీపీ నాయకులు చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, ముమ్మనేని ప్రసాద్, కోనేరు రాజేష్, కోవ్వూరి కిరణ్, జాస్తి సురేష్, కోడూరు ఆంజనేయ వాసు, పౌరసరఫరాల శాఖ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'కోరుకొండ మండలంలో వేగవంతంగా రహదారుల పునర్నిర్మాణం..'

**- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ 'బొడ్డు'..!**

**- మధురపూడిలో రూ.1.29 కోట్లతో నూతన రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే 'బత్తుల'.., రుడా చైర్మన్ 'బొడ్డు'..!!**



కోరుకొండ, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)-రాజానగరం నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని, ప్రతి గ్రామాన్ని సురక్షితమైన మరియు నాణ్యమైన రహదారులతో అనుసంధానించడమే తమ ప్రాథమిక కర్తవ్యమని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో రూ.1.29 కోట్ల అంచనా వ్యయంతో మధురపూడి దుర్గమ్మ గుడి వద్ద నుండి గాడాల తొర్రేడు ఆర్.డి. రోడ్డు వరకు నిర్మించనున్న నూతన రహదారి నిర్మాణ పనులకు ఆయన బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... మధురపూడి దుర్గమ్మ గుడి వద్ద నుండి గాడాల తొర్రేడు ఆర్.డి. రోడ్డు మార్గం స్థానిక ప్రజల రాకపోకలకు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అత్యంత కీలకమైనది. గత కొంతకాలంగా దెబ్బతిన్న ఈ రహదారి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను పారద్రోలేందుకు రూ.1.29 కోట్లు నిధులు కేటాయించి ఈ పనులను ప్రారంభించాం. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించేది లేదు. పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది' అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, జనసేన, తెలుగుదేశం,బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే అభివృద్ధి : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**- ఎంపీ కార్యాలయంలో ప్రజా దర్బార్**

**- వినతిపత్రాలతో బారులు తీరిన ప్రజలు**

**ఎంపీను కలిసిన అమరావతి ఖరగపూర్ ఎక్స్ ప్రెస్ హైవే గ్రామాల ప్రజలు**

**-నేవీ డిపో భూములపై బోడిగూడెం గ్రామస్థుల భిన్న స్వరం**

**సీఎంతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



ఏలూరు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: వివిధ అభివృద్ధి పనులకు భూసేకరణ చేసే సమయంలో స్థానిక ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తూ ముందుకు వెళతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎంపీ ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను కలిశారు. కొత్తగా నిర్మిస్తున్న అమరావతి -ఖరగపూర్ ఎక్స్ ప్రెస్ హైవే భూ సేకరణలో తమ భూములు, ఇళ్ళు నష్టపోకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవే అధికారులతో, కేంద్ర మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వారికి హామీ ఇచ్చారు. ఎంపీ ను కలిసిన వారిలో ప్రధానంగా బయ్యనగూడెం, సీతంపేట, వీరన్నగూడెం, సరిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు, ప్రజలు ఉన్నారు.

### నేవీ డిపోపై సీఎంతో చర్చించి నిర్ణయం

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుతో భూములు కోల్పోతున్న కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామస్థులు బుధవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఆయన కార్యాలయంలో కలిశారు. భూములు కోల్పోతే తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ, భూములు కోల్పోయే రైతులకు, గ్రామస్థులకు న్యాయమైన పరిహారం, హామీల అమలు తర్వాతే, సంబంధిత గ్రామాల ప్రజలందరి అంగీకారంతోనే నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు పై ముందుకు వెళతామని స్పష్టం చేశారు. దీనిపై తాను త్వరలోనే సీఎంతో సమావేశమై చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు.



### జిల్లా టీడీపీ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఎంపీ

ఏలూరు జిల్లా టీడీపీ పార్టీ కార్యవర్గ సమావేశం బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉపాధ్యక్షుడు జగ్గవరపు ముత్తారెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు. పొత్తులో భాగంగా ఎవరికి అవకాశం ఇచ్చినా కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా ఉండి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని తీర్మానం చేస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు.



## బుక్కపట్నం మండలంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరమ్మ , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కి గ్రామాల్లో జన ప్రభంజనం

**అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు**

**1 లక్షా కోట్లతో పుట్టపర్తిలో ప్రజల తలరాత మార్చే యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు**

**ఆమడగూరులో రూ.51వేల కోట్లతో రిలయన్స్**

**జగన్ హయాంలో వైసిపిది విధ్వంస పాలన**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం**

**స్థానిక ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్ కూడా రాదు**

**పుట్టపర్తి నియోజవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

**నేడు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా బుక్కపట్నం మండలం లో 53 పనులకు ప్రారంభోత్సవం**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: బుక్కపట్నం మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.20.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 53 అభివృద్ధి పనులకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రికి ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, నియోజకవర్గంలో సుమారు రూ.69 వేల కోట్లతో వివిధ అభివృద్ధి, పెట్టుబడి ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని వారు తెలిపారు. పుట్టపర్తి ప్రాంత ప్రజల తలరాతను మార్చే విధంగా సుమారు రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరులో రిలయన్స్ సహకారంతో రూ.51 వేల కోట్ల భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు వంటి పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. వీటి ద్వారా పెద్దఎత్తున ఉపాధి, ఆర్థిక అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను చేపడుతోందని వారు పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ప్రజలు ఆదరిస్తారని, గ్రామాల అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.బుక్కపట్నం మండలంలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులు:బుక్కపట్నంలో రూ.57 లక్షలతో 8 సీసీ రోడ్లు.రూ.36 లక్షలతో బుక్కపట్నంలో హెల్త్ సెంటర్.జానకంపల్లిలో రూ.16 లక్షలతో 4 సీసీ రోడ్లు.బుచ్చయ్యగారిపల్లిలో రూ.59 లక్షలతో కేజీబీవీ లైబ్రరీ, కంప్యూటర్ హాల్, కాంపౌండ్ వాల్.లి రూ.1.60 కోట్లతో కేజీబీవీ కళాశాల నిర్మాణం చెంద్రాయణపల్లిలో రూ.46 లక్షలతో పాఠశాల భవనం, రూ.8 లక్షలతో సీసీ రోడ్డు. సిద్ధరాంపురంలో రూ.36 లక్షలతో వాటర్ ట్యాంక్. లింగప్పగారిపల్లిలో రూ.17 లక్షలతో 2 సీసీ రోడ్లు.ధూపంపల్లిలో రూ.25 లక్షలతో 2 సీసీ రోడ్లు.గూనిపల్లిలో రూ.10 లక్షలతో 2 సీసీ రోడ్లు. కొత్తకోటలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు.ఎర్లంపల్లిలో రూ.2.02 కోట్లతో సాస్కి నిధులతో బీటీ రోడ్డు. అగ్రహారంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు. పాముదుర్తి రోడ్డు నుంచి అగ్రహారం వరకు రూ.99 లక్షల సాస్కి నిధులతో బీటీ రోడ్డు.లిపాముదుర్తిలో రూ.50 లక్షలతో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం.పాముదుర్తి--నల్లమడ రోడ్డు నుంచి రెడ్డివారిపల్లి తండా వరకు రూ.2.87 కోట్ల సాస్కి నిధులతో బీటీ రోడ్డు.మాదిరేబైలు పంచాయతీ కార్యాలయ భవనానికి రూ.32 లక్షలు. గసికవారిపల్లిలో రూ.15 లక్షలతో 2 సీసీ రోడ్లు. గసికవారిపల్లి--బోయ ముసలప్పగారిపల్లి వరకు రూ.4.63 కోట్ల సాస్కి నిధులతో బీటీ రోడ్డు. మారాలలో రూ.25 లక్షలతో 2 సీసీ రోడ్లు. యాదాలంకపల్లిలో రూ.24 లక్షలతో 3 సీసీ రోడ్లు. పాముదుర్తి రోడ్డు నుంచి యాదాలంకపల్లికి రూ.35 లక్షల సాస్కి నిధులతో రోడ్డు. కృష్ణాపురంలో రూ.41 లక్షలతో పలు సీసీ రోడ్లు.కృష్ణాపురం--పాముదుర్తికి రూ.2.05 కోట్లతో ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు. గోపాలపురంలో రూ.24 లక్షలతో 4 సీసీ రోడ్లు. లిపలు గ్రామాల్లో మరో రూ.55 లక్షలతో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు.మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు ,బుక్కపట్నం మండల టీడీపీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## యువ డాక్టర్లపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::యువ వైద్యులపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, మంచి మార్గంలో పయనించి మీరు బాగుపడుతూ, సమాజ బాగుకోసం పనిచేయాలని నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి హితబోధ చేశారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో యువత భవిష్యత్ కు భరోసా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నేను చాలా కళాశాలలకు వెళ్ళాను. ప్రాథమికంగా యువజన కార్యక్రమాలన్నీ అక్కడే జరిగాయి. కాబట్టి, ఈ రోజుల్లో నేను చాలా కళాశాలలకు వెళ్ళాను. సమాజంలో వైద్యుల స్థానం గొప్పది. యువత భవిషత్ కు భరోసా రాష్ట్రవ్యాప్త కార్యక్రమం. సమాజంలో, దేశంలో లేదా భవిష్యత్ తరంలో యువత పోషించే ప్రధాన పాత్ర యువతదే అన్నది అందరికీ తెలిసిన విషయమే. మీరు ప్రధాన పాత్ర పోషిస్తారు. దాదాపు 30 శాతం జనాభా యువత, ప్రతి ముగ్గురు లేదా నలుగురిలో ఒకరు మీరే జనాభాలో కొంత శాతం యువత ఉన్నారు, ఆ తర్వాత ప్రతి ముగ్గురు లేదా నలుగురిలో ఒకరు మీరే. కాబట్టి మీరు ఒక సమూహంగా నేను మీకు చెప్పాలనుకుంటున్నాను, నా వృత్తిరీత్యా నేను ఒక వైద్యురాలును, మీకు తెలుసా, నేను నా ఎం బిబిఎస్ ను మైసూరులో, నా పిజి ఎం డి రేడియాలజీని నెల్లూరులో పూర్తి చేశాను. నా ఫెలోషిప్ కూడా అక్కడే జరిగింది, కాబట్టి ఇదే నా వృత్తి. కాబట్టి, నేను నిజానికి ఇక్కడ రాజకీయ ప్రసంగం చేయడానికి రాలేదు. నేను చెప్పేది ఏమిటంటే, యువత ఇక్కడ ఒక ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఒక సమూహంగా మనం ఎలా మారాలి, మనం ఎలా కొత్తదనాన్ని తీసుకురావాలి, మనం చేసేది అదే, మీ భవిష్యత్తును మార్చగల సత్తా మీకే ఉంది. అవును, విషయం అదే. ఇది జరగాలిఅంటే. కేవలం ప్రతిభ మాత్రమే ముఖ్యం కాదు. ప్రతిభ ముఖ్యం, ప్రస్తుత కాలంలో సాంకేతికత కూడా ముఖ్యం.అలాగే మనం చేసేది ఏమిటంటే, మీ భవిష్యత్తును, మీరు మార్చుకోగలరు, ఇది జరగాలి, కేవలం ప్రతిభ మాత్రమే ముఖ్యం కాదు. ప్రస్తుత కాలంలో సాంకేతికత కూడా ముఖ్యం, అలాగే నాయకత్వం కూడా చాలా ముఖ్యం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.నాయకత్వం అంటే కేవలం ఎమ్మెల్యేగానో, ఎంపీగానో, ప్రధానమంత్రిగానో, రాష్ట్రపతిగానో ఉండటం మాత్రమే కాదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, యువతలో ఆ నాయకత్వ లక్షణాలు ఉండాలి.ఆ నాయకత్వ లక్షణాలు లేకుండా మనం ఏమీ చేయలేము. మీకు ఒక ఉదాహరణ ఇస్తాను.






నేను నా పీజీ పూర్తి చేశాను. ఆ తర్వాత నాయకురాలు గా, ప్రజా ప్రతినిధి గా ఉంటున్నా అన్నారు.భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లు యువత భవిష్యత్ కు భరోసా ఇచ్చే అనేక కార్యక్రమాలు చేస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకువాలని యువ వైద్యులను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

## దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం

**- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత చురుకైన భాగస్వాములుగా ముందుకు రావాలి**

**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



**నంద్యాల, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: చదువుతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్ష్యణాలు సృజనాత్మకతను పెంపోందించుకొని ఉన్నత శిఖరాకు ఎదగాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజన ప్రతిభ ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, నుక్కడ్ నాటకం, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించారు. యువత తమ కళా, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేలా ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశ ప్రగతిలో యువత కీలక భాగస్వాములని. యువతలోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి, వారిని దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యతో పాటు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యువతకు అందుబాటులోకి వస్తున్న ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆకాంక్షించారు.**

నేటి శుభోదయ
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్
గురువారం - 01- అక్టోబర్ - 2026

# పేరుకే పెద్ద ఆసుపత్రి- రూ.11 కోట్ల ఆస్పత్రి, వైద్యం మాత్రం అందని ద్రాక్ష

**- 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది కొరత, ఒకే డాక్టర్‌తో వందలాది మంది రోగులకు వైద్యం**

**- గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యుడు ఎక్కడ**

**- ఉదయం నుంచి రోగుల పడిగాపులు**

**- వరంగల్ నుంచి చిన్నపిల్లల వైద్యుడిని కేటాయించినా విధులకు హాజరు కాలేదంటున్న సమాచారం**

**- డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యుడి హాజరుపైనా ఆరోపణలు**

**- జిల్లా అధికారుల దృష్టికి ఫిర్యాదులు**

**- ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా, వైద్యం కోసం ఖమ్మం, తిరువూరుకు వెళ్లాల్సిందేనా అని ప్రజల ఆవేదన**

ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గంలో గల కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ.11 కోట్ల వ్యయంతో 50 పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకున్న ఈ ఆస్పత్రి, వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులకు పూర్తి స్థాయి సేవలు అందించలేకపోతోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## - ఒకే డాక్టర్, వందలాది మంది రోగులు

మంగళవారం వివిధ గ్రామాల నుంచి సుమారు 220 మంది వరకు వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. అయితే అందుబాటులో ఉన్న వైద్యుల్లో ఒకే ఒక్క డాక్టర్ రోగులను పరిశీలించాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఉదయం నుంచి రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. ఒకే వైద్యుడు ఇంతమంది రోగులను పరిశీలించడం సాధ్యమవుతుందా, అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితి ఏమిటి, అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- మహిళా రోగులకు గైనకాలజిస్ట్,

## పిల్లలకు పీడియాట్రిషియన్ ఏరి?

మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వస్తున్నప్పటికీ గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు కారణమవుతోందని రోగులు చెబుతున్నారు. మరోవైపు చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలకు అనారోగ్యం వచ్చినప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు ప్రభుత్వ ఆస్పత్రులపైనే ఆధారపడుతున్నాయని, ఇక్కడ వైద్యుడు అందుబాటులో లేకపోతే ఖమ్మం, తిరువూరు వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యుడి హాజరుపైనా ఆరోపణలు

కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న ఒక ప్రముఖ వైద్యుడు సత్తుపల్లి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారని, అయితే ఆయన క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.అదేవిధంగా ఆ వైద్యుడు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో ప్రైవేటు నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు విధుల హాజరు, డిప్యూటేషన్ నిబంధనలు, ప్రైవేటు ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## - జిల్లా అధికారి దృష్టికి సమస్య

ఆస్పత్రిలో వైద్య సేవలు, వైద్యుల హాజరు, సమయపాలన తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా అధికారి రాజశేఖర్ గౌడ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు చేపడతామని ఆయన తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

## - రూ.11 కోట్ల భవనం, వైద్యులు లేకపోతే ప్రయోజనం ఎంత

ఏళ్ల తరబడి కల్లూరు ప్రజలు ఎదురుచూసిన 50 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చినా, అవసరమైన వైద్యులు, సిబ్బంది లేకపోతే దాని పూర్తి ప్రయోజనం ప్రజలకు ఎలా అందుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.భవనం



నిర్మించడం మాత్రమే కాదు. అందులో నిరంతర వైద్య సేవలు అందేలా చూడడం కూడా ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఐదుగురు డాక్టర్స్ ఉన్నారని అందులో మెడికల్ సూపరిశీటెండెంట్ రమేష్ శనివారం నుండి లీవ్ లో ఉన్నారని 17 మంది స్టాఫ్ నర్స్, ఒక హెడ్ నర్స్, ఏఎన్ఎంలు 2, ల్యాబ్ 2, ప్రస్తుతం ఫార్మసిస్ట్ సెలవు లో ఉన్నారని అట్టి బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్స్ ఉదయ్ శ్రీ విధులు నిర్వహిస్తున్నారని అధికారి తెలిపారు. ఫార్మసిస్ట్ లేకుండా అవగాహన లేకుండా మందులు ఇస్తే రోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. స్టోర్ మైంటైన్ చేయాలంటే ఫార్మసిస్టుతో పాటు ఖచ్చితమైన అధికారి పర్యవేక్షణ ఉండాలి. పర్యవేక్షణ చేయవలసిన అధికారులు సరైన రీతిలో సక్రమమైన పద్ధతులలో వైద్యం అందించవలసిన అధికారులు నమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఇది ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ దూర ప్రాంతాల నుంచి పేదలు వైద్యం కోసం వస్తుంటే, కీలక విభాగాలకు వైద్యులు లేకపోవడం, ఒకే డాక్టర్‌పై అధిక భారం పడటం, సిబ్బంది హాజరుపై ఫిర్యాదులు రావడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే ప్రత్యేక తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో కేవలం హామీలకే పరిమితం కాకుండా.. వైద్యుల హాజరు, సిబ్బంది కొరత, మందుల లభ్యత, గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలు, డిప్యూటేషన్ వైద్యుల విధులు, ఆస్పత్రి నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దమ్మాయిగూడెం లో పోషణ మాసోత్సవ కార్యక్రమం



తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోఉత్సవాల కార్యక్రమం దమ్మాయిగూడెంలో ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ నెలలో నిర్వహించే జాతీయ కార్యక్రమం పోషణ మాస ఉత్సవాలు అని సూపర్వైజర్ సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026వ సంవత్సరంలో ఇది తొమ్మిదవ జాతీయ మాసోత్సవం తెలంగాణలో మంత్రి సీతక్క సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు కార్యక్రమం నిర్వహించాలని ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు కార్యక్రమం క్యాలెండర్ను విడుదల చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్న ప్రసన్న, గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేస్తారని అలాగే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఆమె అన్నారు. పోషకాహార ప్రదర్శన, అవగాహన ర్యాలీలు నిర్వహించి పిల్లల సంరక్షణ విషయంలో సమాజాన్ని చైతన్య పరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, వైవిధ్యభరితమైన పోషణ పరిష్కారం, అంగన్వాడీలో వేడిగా వండిన భోజనం, సమాజ భాగస్వామ్యం మరియు బాధ్యత, పోషణ ప్రాథమిక విద్య బాలల వికాసం, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, మాతృ సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడెం గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద, గర్భిణీలు షేక్ రేష్మ, పేగు పూలనదేవి , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సావిత్రి, తల్లులు బాజే స్పందన, సొందుబి,నవిత, రమ్య, కస్తూరమ్మ, అంగన్వాడీ టీచర్స్ ఎస్ పద్మ, కే మలుసూరమ్మ, నాగేంద్ర, నాగమణి, నిర్మల, జయమ్మ, ఎల్లమ్మ, ఉపేంద్ర, రేణుక, రంగనాయకమ్మ,ఆశ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడులో క్రీడా వైభవం వెల్లివిరియాలి

**యువత కోసం మండవ రవి సేవలు స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే జూలకంటి**




మాచర్ల: ఆర్ సి ఇంచార్జ్ సెప్టెంబర్ 30; నేటి శుభోదయ : వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో క్రీడా వైభవం వెల్లివిరియాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బుధవారం మాచర్లలోని ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండవ మాచర్ల ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి టాస్ వేసి తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. యువత కోసం జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రికెట్ లీగ్‌ను నిర్వహిస్తున్న మండవ రవిని అభినందించారు. పట్టుదల, దీక్ష, కఠోర శ్రమతో ముందుకు సాగే క్రీడాకారులు ఏదో ఒక రోజు విజయ తీరాలను చేరుకుంటారని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను కూటమి ప్రభుత్వం గౌరవించి మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తే వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై కూడా ఆయన విమర్శలు చేశారు. మాచర్ల నియోజకవర్గంలోని యువత కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మండవ రవికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడాకారుల కోసం త్వరలో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం స్థల పరిశీలన జరుగుతోందన్నారు. అలాగే తన సొంత ఖర్చులతో క్రికెటర్లు నెట్ ప్రాక్టీస్ చేసుకునేందుకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు వెంకటరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మదార్ సాహెబ్, టోర్నీ ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులు అన్వర్ బాషా, క్రాంతికుమార్, చిన్ని, కేపీచారి, సాంబ తదితరులు పాల్గొన్నారు.



# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**- లేఔట్ అనుమతికి అప్రోచ్ రోడ్డు తప్పనిసరి**

**- వాటర్ బాడీస్ ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్‌లలో ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దు**

**- లేఔట్ దరఖాస్తులపై సంయుక్త తనిఖీ నివేదికలను అక్టోబర్ 15లోగా సమర్పించాలి**

**- జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పెండింగ్‌లో ఉన్న లేఔట్ అనుమతులపై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, తదితర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలు, ఎన్‌ఓసీల స్థితిగతులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ లేఔట్ కమిటీ సమావేశం అనంతరం అనుమతులు మంజూరైనప్పటికీ కొంతమంది దరఖాస్తుదారులు ఆన్లైన్‌లో అనుమతులు మంజూరు కాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇకపై లేఔట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే సంబంధిత ఆన్లైన్ మంజూరు ప్రక్రియను మూడు రోజుల్లోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేఔట్ అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలన, సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత లేఔట్ భూమి చెరువులు, నీటి వనరులు, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఉందా లేదా క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖలు తమ పరిధిలోని అంశాలను పరిశీలించి అవసరమైన ఎన్‌ఓసీలు, నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు.లేఔట్ కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లేఔట్‌లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.లేఔట్‌లో స్ట్రీట్ లైట్స్, సీవరేజ్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయరాదని స్పష్టం చేశారు.లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు, నీటి ప్రవాహ మార్గాలు ఉన్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని తెలిపారు.అనుమతులు మంజూరు చేసిన అనంతరం కూడా వాటిలో పేర్కొన్న నిబంధనలను లేఔట్ అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి లేఔట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నివేదికలకు స్పష్టమైన కాలపరిమితి విధించి, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సంయుక్త పరిశీలన అవసరమైన లేఔట్లకు సంబంధించిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులను అక్టోబర్ 15వ తేదీలోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌పిడిసిఎల్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పల్లె పండుగతో నిధుల ప్రవాహం..!

# మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అడుగులు

**-- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



కారంపూడి/దుర్గి, సెప్టెంబర్ 30: ఆర్ సి ఇంచార్జ్ ; నేటి శుభోదయ : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పల్లెపండుగ 3.0లో భాగంగా 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్--గ్రామీణ' పథకం నిధులతో మాచర్ల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో బుధవారం కారంపూడి, దుర్గి మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

కారంపూడి బీసీ కాలనీలో రూ.23 లక్షలతో, దుర్గి మండలం అడిగొప్పలలో రూ.20 లక్షలతో, ఓబులేసునిపల్లెలో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఓబులేసునిపల్లెలో రూ.2 లక్షలతో నిర్మించనున్న మినీ గోకులం షెడ్‌కు కూడా శంకుస్థాపన చేశారు.

దుర్గి మండల కేంద్రంలో రూ.47 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.అనంతరం దుర్గి ఇందిరమ్మ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రహదారులు, ఇతర సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని ఆయన తెలిపారు.కార్యక్రమాల్లో ఎంపీడీవోలు శ్రీనివాసరెడ్డి,

ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఏఈ సత్యనారాయణతో పాటు కూటమి పార్టీల నాయకులు పంగులూరు అంజయ్య,

పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, మునుగోటి సత్యనారాయణ, లింగా బ్రహ్మయ్య, సీతారామాంజనేయులు, గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్‌వలి, యాగంటి నరేష్, ఉన్నం మహేష్, గోపాల్, సింగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించండి

**ఎం పి అంబికా లక్ష్మీనారాయణ**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 30 నేటి శుభోదయ : ఈరోజు అనంతపురం నగరం లోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన 4వ పార్టీ సమావేశంలో ఎం పి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి , అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ , సింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణిశ్రీ , శ్రీ కృష్ణకుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా ఎంపికైన కేశవకు ఘన సన్మానం



యాడికి, సెప్టెంబర్ 30 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రమైన యాడికిలో పారిశుద్ధ్య రంగంలో విశేష సేవలందిస్తున్న కార్మికులకు అధికారులు, తోటి సిబ్బంది అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక డంపింగ్ యార్డ్ వద్ద బుధవారం 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వివిధ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు (హెల్త్ చెకప్) నిర్వహించారు.ఈ ఆరోగ్య శిబిరంలో భాగంగా, గత ఆగస్టు నెలలో అనంతపురం పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా 'ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడు' అవార్డు అందుకున్న కేశవను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వద్ద డిప్యూటీ ఎంపీడీవో శశికళ, పంచాయతీ ఈవో గీత తదితరులు కలిసి కేశవను శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు.సమాజంలో ఎవరూ చేయని పారిశుద్ధ్య సేవలను నిస్వార్థంగా అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న కేశవను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు..

## పుప్పాల తండాలో ఎస్టీ రైతులకు జొన్న విత్తనాల పంపిణీ



యాడికి, సెప్టెంబర్ 30 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని పుప్పాల తండాలో బుధవారం జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద ఎస్టీ రైతులకు రాయితీపై నూతన వంగడమైన 'ఎన్‌టీజే-5' జొన్న విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నాయని, అందులో భాగంగానే రైతులకు రాయితీ విత్తనాలు, సూక్ష్మ పోషకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త రకం జొన్న వంగడాలు అధిక దిగుబడిని ఇవ్వడంతో పాటు, బెట్ట పరిస్థితులను, చీడపీడలను సమర్థవంతంగా తట్టుకోగలవని వివరించారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ (పంట) నమోదు మరియు పంట బీమా చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం, వర్షాభావ, బెట్ట పరిస్థితుల్లో వేరుశనగ పంట పరిస్థితి ఎలా ఉందనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారి పవన్ కుమార్, పుప్పాల తండా గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## చివరి బంతి వరకు ఉత్కంఠ.. లయన్స్‌దే గెలుపు!

## వెల్దుర్తి వారియర్స్‌పై ఐదు పరుగుల తేడాతో విజయం



మాచర్ల: ఆర్ సి ఇంచార్జ్ సెప్టెంబర్ 30; నేటి శుభోదయ : మండవ మాచర్ల ప్రీమియర్ లీగ్ (ఎంఎంపీఎల్)లో భాగంగా బుధవారం జరిగిన తొలి టీ20 క్రికెట్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన పోరులో ఓల్డ్ టౌన్ లయన్స్ జట్టు వెల్దుర్తి వారియర్స్‌పై ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన వెల్దుర్తి వారియర్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఓల్డ్ టౌన్ లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. ప్రత్యర్థి ముందు 152 పరుగుల విజయలక్ష్యాన్ని ఉంచింది. లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన వెల్దుర్తి వారియర్స్ ఆరంభం నుంచి పోరాట పటిమ కనబరిచింది. వికెట్లు కోల్పోతున్నప్పటికీ పరుగుల సాధనలో వెనుకడుగు వేయకుండా చివరి వరకు విజయంపై ఆశలు నిలుపుకుంది. అయితే లయన్స్ బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. చివరకు వెల్దుర్తి వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులకే పరిమితమైంది. దీంతో ఓల్డ్ టౌన్ లయన్స్ ఐదు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది.బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ ప్రతిభ కనబరిచిన ఎర్రబోయిని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మాచర్ల పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ జలీల్ చేతుల మీదుగా ఎర్రబోయినికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని అందజేశారు. మ్యాచ్‌ను వీక్షించిన క్రీడాభిమానులు ఇరు జట్ల ఆటతీరును ఆసక్తిగా తిలకించారు.

## వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఐడీ కార్డుల పంపిణీ

### పార్టీ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చర్చ



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 30; నేటి శుభోదయ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 18, 19వ వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించి, వార్డుల వారీగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ, స్థానిక పరిస్థితులపై చర్చించారు. పార్టీ కార్యకలాపాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 18, 19వ వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలి

### - ఐడీసీఎస్ సీడీపీవో యం కవిత




ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం ను తీసుకోవాలని ఐసీడీఎస్ తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ సీడీపీవో యం కవిత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషక మాసోత్సవం ను నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో తయారు చేసిన వివిధ వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. దీని వలన రక్తహీనత, పోషకాహార లోపం ను నివారించవచ్చునని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, సర్పంచ్శీలం వెంకటలక్ష్మి, వైద్యాధికారులు ఆర్.శ్రావణకుమార్, గీత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయా లు తదితరులు పాల్గొన్నారు.

# మెట్ట వరి సాగులో సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

**- తిమ్మినేనిపాలెంలో ఘనంగా 'పొలంబడి' కార్యక్రమం**

**- తక్కువ నీటితో డ్రిప్ సాగు, వెదజల్లే పద్ధతి లాభదాయకం : సర్పంచ్ చాపలమడుగు వీరబాబు**



ఖమ్మం, తిమ్మినేనిపాలెం, చింతకాని, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: మెట్ట వరి సాగులో అతిగా రసాయన పురుగుమందులను వాడకుండా సమగ్ర సస్యరక్షణ (ఐపిఎం) పద్ధతులను పాటించడం వల్ల తక్కువ ఖర్చుతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త సౌజన్యంతో చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామంలోని మెట్ట వరి పొలంలో బుధవారం నిర్వహించిన 'పొలంబడి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిమ్మినేనిపాలెంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**తక్కువ నీటితో సమర్థవంతమైన సాగు, కూలీల ఖర్చుకు చెక్**

సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన రైతు కూచిపూడి కోటేశ్వరరావు తన మెట్ట పొలంలో సాంప్రదాయ నాటు పద్ధతిలో కూలీల ఖర్చు ఎక్కువగా ఉండటంతో, భిన్నంగా ఆలోచించి వరి విత్తనాలను నేరుగా వెదజల్లి సాగు చేశారని తెలిపారు. అంతేకాకుండా, ఆ మెట్ట పొలానికి డ్రిప్ సిస్టమ్ (బిందు సేద్యం) అమర్చి అతి తక్కువ నీటితో వరి పంటను విజయవంతంగా పండిస్తున్నారని పేర్కొన్నారు.ఈ విధానం వల్ల నీటి కొరత సమస్య

రడమే కాకుండా, పంటకు అవసరమైనంత నీరు అంది వరి మొక్కలు అత్యంత సౌకర్యవంతంగా, ఆరోగ్యకరంగా పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. మొక్కలు దూర దూరంగా ఉండటం వల్ల వెలుతురు, గాలి బాగా తగిలి ప్రతి వరి దొబ్బుకు దాదాపు 30 వరకు పిలకలు తొడిగి పంట బలంగా ఎదిగిందని వివరించారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితోనే ఎకరానికి సుమారు 36 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నూతన సాగు విధానాన్ని చూసి చుట్టుపక్కల రైతులు సైతం విశేషంగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. తిరుమలాపురం గ్రామంలో కూడా వరి సాగు చేస్తున్న రైతులకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు వ్యవసాయ శాఖ అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ ఐ. వాణిశ్రీ, ఎఫ్‌టీసీ ఏడీఏ మిట్టపల్లి సతీష్, ఎఫ్‌టీసీ ఏఓ ఇంటూరి భాస్కర్, ఎఫ్‌టీసీ ఏఓ అబ్బూరి సతీష్, చింతకాని ఎంఏఓ పి. సతీష్, ఏఈఓ కార్తీక్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తిమ్మినేనిపాలెం గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు, ఉప సర్పంచ్ కూచిపూడి బుచ్చిబాబు, బద్రి, దమ్మాలపాటి వీరయ్య, షేక్ అబ్దుల్, ఎస్‌కే మదర్, దమ్మలపాటి వెంకటేశ్వర్లు, ఆళ్ల శ్రీనివాసరావు, మొనగాల హనుమంతరావు, గోగుల నరసింహారావు, మరీదు మధు తదితర రైతులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హార్టీ కల్చర్ హాబ్ తో దేశంలోనే రాయలసీమ నెంబర్ వన్

**జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**

**రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ప్రారంభం**

**అక్టోబర్ 2న సీఎం చంద్రబాబుశ్రీకారం**

**రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా కూటమి పాలన**

**సీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటు**

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్న సీఎం చంద్రబాబు**

**సీమ సహా పులివెందుల వాసులను మోసగించిన జగన్**

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందులలో మాదే విజయం : మంత్రి సవిత ధీమా**

**పులివెందులలో భారీ ట్రాక్టర్ ర్యాలీ**

**స్వయంగా ట్రాక్టర్ నడిపిన మంత్రి సవిత**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: రూ.లక్ష కోట్లతో ఏర్పాటు చేయనున్న హార్టీ కల్చర్ హబ్ తో దేశంలోనే రాయలసీమ ఉద్యానవన సాగులో నెంబర్ వన్ గా నిలవనున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వచ్చే నెల రెండో తేదీన మదనపల్లెలో సీఎం చంద్రబాబునాయుడు హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుడుతున్నారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో పులివెందుల వాసులను, రాష్ట్ర ప్రజలను జగన్ నమ్మించి మోసం చేస్తే... కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల మున్సిపాల్టీలో కూటమి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమలో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటును హర్షిస్తూ...బుధవారం పులివెందులలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత నేతృత్వంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి రెండున్న కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో మంత్రి సవిత స్వయంగా ట్రాక్టర్ నడిపి కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పులివెందుల నియోజక వర్గ టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల పనులు కొనసాగిస్తూనే...మరో వైపు పెద్ద ఎత్తున పరిశ్రమలను నెలకొల్పోతున్నారన్నారు. దీనిలో భాగంగా రూ.లక్ష కోట్లతో రాయసీమలో హార్టీకల్చర్ హబ్ ను ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ హార్టీకల్చర్ హబ్ తో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కూడా లబ్ధి పొందుతుందన్నారు. హార్టీకల్చర్ హబ్ తో దేశంలోనే ఉద్యానవన సాగులో రాయలసీమ నెంబర్ వన్ గా నిలవనుందన్నారు. అక్టోబర్ 2న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా...రూ.లక్ష కోట్లతో చేపడుతున్న రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ ను వచ్చే నెల రెండో తేదీన గాంధీ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. రూ.లక్ష కోట్లలో రూ.30 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు నిధులు, రూ.10 వేల కోట్లు కేంద్రం, మిగిలిన రూ.60 వేల కోట్లు ప్రైవేటు నిధులు వెచ్చిస్తున్నాయన్నారు. హార్టకల్చర్ హబ్ ఏర్పాటుతో రాయలసీమ రూపురేఖలు మారనున్నాయన్ని మంత్రి సవిత ఆనందం వెలిబుచ్చారు. జగన్ మాట తప్పితే... చంద్రబాబు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు...కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని మంత్రి సవిత తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు రోడ్లు, కాలువలు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా, రైజింగ్ రాయలసీమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పరిశ్రమలను విస్తృత్తంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో జగన్ చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చలేకపోయారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తోందని మంత్రి సవిత తెలిపారు. పులివెందుల మున్సిపాల్టీ మాదే...జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించిన పులివెందుల వాసుల రుణం తీర్చుకునేలా పాలన సాగిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. పులివెందులకు సాగు, తాగునీరు అందించిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనన్నారు. పులివెందుల అభివృద్ధిలో టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి పనితీరు ప్రశంసనీయమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల మున్సిపాల్టీలో కూటమి అభ్యర్థి సాధించడం ఖాయమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. ట్రాక్టర్ నడిపిన మంత్రి సవితలిఅంతకుముందు రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ ఏర్పాటును హర్షిస్తూ భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. పులివెందులలోని టీడీపీ కార్యాలయం నుంచి మినీ కార్యాలయం వరకూ రెండున్న కిలో మీటర్ల మేర ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి సవిత కార్యక్రమం ఆద్యంతం ట్రాక్టర్ నడిపి కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. జై చంద్రబాబు, జై కూటమి నినాదాలతో పులివెందుల పట్టణం హోరెత్తిపోయింది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండున్నర సంవత్సరాల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని గండేపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ జాస్తి వసంత్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కోర్పు సాయి తేజ్, మాజీ వైస్ ఎంపీపీ కుంచె రాజా, సీనియర్ నాయకుడు పరిమి బాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా బుధవారం గండేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశాలు జరిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రూపొందించిన నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల పుస్తకాన్ని కార్యకర్తలకు చదివి వినిపించారు. అందులో పొందుపరిచిన ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశాలకు గండేపల్లి, మురారి, నాయకంపల్లి, సూరంపాలెం, రామయ్యంపాలెం ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశీ, ఇప్పెర్ల సురేష్, పందు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## "జట్లపాలెం హైస్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎస్ఎంసి చైర్మెన్ గా బత్తుల నరేష్ ఏకగ్రీవ ఎన్నిక "



పెంటపాడు సెప్టెంబరు 29 (నేటి- శుభోదయ) జట్లపాలెం హైస్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసి) చైర్మెన్ గా కూటమి నాయకులు బలపరిచిన బత్తుల నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వైస్ చైర్మన్ గా మోంజిపాడు గ్రామానికి చెందిన గంటా విజయదుర్గ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్గ గా నియమితులైన బత్తుల నరేష్ ను పలువురు కూటమి నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన నాయకుల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. చైర్మన్ గా నియమితులైన బత్తుల నరేష్ మాట్లాడుతూ హైస్కూల్లో మిడ్ డే మీల్స్ నాణ్యత ప్రమాణాలు పాటించేందుకు కృషి చేస్తానని విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను పంపిణీ జరిగేలా బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యాబోధన మరియు సమయపాలన పాటించేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కుదుళ్ల చంద్రశేఖర్, పాశం బుల్లి వెంకటరమణ, కుదుళ్ళ శ్రీనివాసరావు, పెనుబోతుల బాలాజీ మరియు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో పల్లె పండుగ హీట్

### బూరుగుపూడి నుండి 2 ఏళ్ల సంక్షేమ ప్రచారానికి శ్రీకారం



**కాకినాడ జిల్లా కిర్లంపూడి, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధితో పేదల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తోందని నిరూపిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు బుధవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో కూటమి ఆత్మీయ సమావేశం జరిగింది. మాజీ ఎంపీపీ తోట రవి, టీడీపీ సీనియర్ నేత కుంచె తాతాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" పేరుతో రూపొందించిన 5 పేజీల ప్రత్యేక పుస్తకాన్ని ప్రతి ఇంటికి అందించే కార్యక్రమాన్ని బూరుగుపూడి నుండి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిపై చర్చిస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి నాగేశ్వరరావు, బాలుకుల చిన్నోడు, పాఠంశెట్టి కొండరాజు, మురసత్తిబాబు, సోము పుచ్చయ్య, కర్నాకుల వీరబాబు, కుంచె శ్రీనివాస్, కర్నాకుల సూరిబాబు, పాఠంశెట్టి తమ్మారావు, బాలిన ఎర్రిబాబు, బూత్ ఇంఛార్జ్ కొప్పన పెద్దకాపు, మరుకుర్తి తాతాజీ, గురజాపు సత్తిబాబు, జనసేన నాయకులు రామిశెట్టి రాజు, ఉలిసి శ్రీనివాస్, బీజేపీ నాయకులు బలిన తాతాజీ, బాలిన ఎర్రిబాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం - ప్రతి గ్రామానికి అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.**

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలు ప్రజల్లోకి

## రావులమ్మ నగర్ లో ప్రత్యేక సంచికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం..

**గ్రామంలో ప్రచారం నిర్వహణ**



కాకినాడ జిల్లా జగ్గంపేట, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: కాకినాడ జిల్లా జగ్గంపేట పట్టణం రావులమ్మ నగర్ లోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక సంచికల ద్వారా ప్రజల్లోకి వెళ్లే ప్రచార కార్యక్రమంపై సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు.రాష్ట్ర టీడీపీ సీనియర్ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీవీఎస్ అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా కాకినాడ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రేఖా బుల్లిరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, క్లస్టర్ ఇంఛార్జ్ దేవరపల్లి మూర్తి, టౌన్ టీడీపీ అధ్యక్షుడు పాంగ్రంగి రాంబాబు హాజరై కార్యకర్తలకు ప్రచార సరళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పర్వం కొనసాగుతోందన్నారు. గత రెండేళ్లలో నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు రూ.171.80 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.418.12 కోట్లు, మొత్తంగా రూ.589.92 కోట్ల నిధులు వెచ్చించినట్లు సంచిక ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. పేదల ఆర్థిక ప్రగతికి బాటలు వేసేలా అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, మత్స్యకార భరోసా, దీపం పథకం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో పాటు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పేద ఆడపిల్లలకు పెళ్లి కానుకగా ఒక్కొక్కరికి రూ.20 వేలు, గోశాలలకు 181 గడ్డి సమకూర్పు, ఉచిత డీఎస్సీ కోచింగ్ ద్వారా 23 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు, ఇరిపాక-తిరుమాలి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, ప్రైమరీ స్కూళ్లకు మౌలిక వసతులు, ల్యాప్ టాప్ లు, పుస్తకాల పంపిణీ వంటి 12 రకాల సేవా కార్యక్రమాలను హైలైట్ చేస్తూ ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోP4 కార్యక్రమం కింద జగ్గంపేట మండలంలో గుర్రంపాలెం రోడ్డులో 10 గ్రామాలకు చెందిన 43 మందికి ఉపాధి కల్పన, మల్లిసాల గ్రామంలో 3 అంగన్వాడీ కేంద్రాలకు రూ.10 లక్షలతో ఆధునీకీకరణ వంటి అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు రాయి సాయి యూనిట్ ఇన్చార్జిలు రీస్ రమణ, గొర్ల వీరబాబు, ఆయిల్ స్వామి, బండారు నాని, వేములకొండ జోగారావు, గెద్దాడ సత్యవేణి, ముక్క పాలు బాబు, పలివెల ఏసుబాబు, పీలా మహేష్, కేసు బోయిన చిన్ని, నే దూరి గణేష్, వేములకొండ జోగారావు, కోంద్రోతు శ్రీను, వాకా గోవిందు, నాండ్ల చిరంజీవి, తుమ్మల కిషోర్, సాంబతుల చంద్రశేఖర్ టీడీపీ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామవరంలో మెయిన్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కిలోమీటర్ కాలినడకన రోడ్డు పనుల పరిశీలన,**

**ప్రజల అభ్యర్థనకు అనుగుణంగా రోడ్డు పూర్తి చేయండి... అధికారులకు ఆదేశం !**



కాకినాడ జిల్లా జగ్గంపేట, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ : జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో జాతీయ రహదారి నుండి ముత్యాలమ్మ చెరువు వరకు నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిలోమీటర్ మేర కాలినడకన రోడ్డు వెంబడి నడుస్తూ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నాణ్యత, కొలతలు, మెటీరియల్ వినియోగంపై అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తుల నుంచి వచ్చిన అభ్యర్థనలు , సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్ అండ్ బి డీఈ కేఎస్ రాఘవరావు, కాంట్రాక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజాధనంతో చేసే పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని, అంచనాలకు తగ్గట్టుగా పకడ్బందీగా రోడ్డు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, రామవరం రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మాజీ సర్పంచ్ మండపాక చిన్న, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, సీనియర్ వార్డు సభ్యులు మండపాక వెంకటేశ్వరరావు( మణికంఠ), జనసేన మండల యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్, జనసేన పార్టీ మాజీ ఎంపీటీసీ దొడ్డ శ్రీను టీడీపీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుమ్ములూరు గ్రామంలో రూ.1.85 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , రుడా చైర్మన్ బొడ్డు వేంకట రమణ చౌదరి..

**- ప్రజల రవాణా కష్టాలు తీర్చడమే ధ్యేయంగా మౌలిక వసతుల విస్తరణ: రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ..**

**- రూ.1.85 కోట్ల నిధులతో గుమ్ములూరు (జగన్నాధపురం) పంచాయతీ ఆఫీస్ నుండి మధురపూడి పుంత రోడ్డు నిర్మాణం..**



కోరుకొండ, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సుసంపన్నం చేస్తూ, ప్రతి గ్రామానికి ఆధునిక రహదారి సదుపాయం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామంలో రూ.1.85 కోట్ల అంచనా వ్యయంతో గుమ్ములూరు (జగన్నాధపురం) పంచాయతీ ఆఫీస్ నుండి మధురపూడి పుంత రోడ్డు వరకు నిర్మించనున్న నూతన రహదారి నిర్మాణ పనులకు ఆయన బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (=ఖణూ) చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... 'గుమ్ములూరు, జగన్నాధపురం పంచాయతీ ప్రాంతాల ప్రజలు మరియు రైతాంగం మధురపూడి వైపు వెళ్లేందుకు ఈ పుంత రోడ్డు అత్యంత కీలకమైనది. ఈ మార్గాన్ని ఆధునీకరించి, నాణ్యమైన బి.టి. రహదారిగా తీర్చిదిద్దేందుకు రూ.1.85 కోట్లు నిధులు కేటాయించాం. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామీణ రవాణాతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు కూడా మరింత వేగవంతం, సులభతరం అవుతుంది. పనుల్లో ఏమాత్రం అలసత్వం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం..' అని స్పష్టం చేశారు.అనంతరం గుమ్ములూరు హై స్కూల్ నందు జరిగిన ఎన్నికలలో చైర్మన్, వైస్ చైర్మన్ లుగా గెలుపొందిన వారిని అభినందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, జనసేన, తెలుగుదేశం,బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**- రూ. 350.78 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



కరీంనగర్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ నూతన కలెక్టరేట్ సముదాయ భవన ప్రారంభంతో పాటు ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేశారు. ఆ తరువాత కరీంనగర్ జిల్లాలకు సంబంధించిన రూ. 350.78 కోట్ల పలు అభివృద్ధి పనులకు వర్చువల్ గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంతిరెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దుళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ , తుమ్మల నాగేశ్వరరావు , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ , ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కరీంనగర్ మేయర్, ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనే పౌరహక్కుల దినోత్సవం లక్ష్యం

**రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి**

**డాక్టర్ కుక్కమూడి ప్రసాద్**




ముటుకూరు, సెప్టెంబర్ 30: ఆర్ సి ఇంచార్జ్ ;నేటి శుభోదయ : సమాజంలో అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించడమే పౌరహక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ అన్నారు.దుర్గి మండలం ముటుకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం సాయంత్రం దుర్గి తహశీల్దార్ ఆదేశాల మేరకు నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి దుర్గి సీనియర్ అసిస్టెంట్ ఎన్. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రజలకు కల్పించిన పౌరహక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. హక్కులను తెలుసుకుని ఆత్మగౌరవంతో జీవించడంతో పాటు, సమాజంలో కుల వివక్షకు తావులేకుండా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ముటుకూరు వీఆర్వో గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హక్కులతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతలను కూడా గుర్తించాలన్నారు. సామాజిక స్పృహతో ఐక్యంగా ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించుకుని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ముటుకూరు ఏఈఎల్‌సీ పాస్టర్ కటికల యేసుదానం పౌరహక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ కాలనీ ప్రజలు డ్రైనేజీ, వీధిలైట్లు, సీసీ రోడ్లు తదితర సమస్యలను సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నోట్ చేసుకున్న ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎస్సీ కాలనీ ప్రజలు, మాచర్ల సామేలు, మాచర్ల ఇశ్రాయేలు, పులిమేల నాగయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అక్టోబర్ 2 నుంచి అవగాహన కార్యక్రమాలు

**యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడేందుకు గ్రామాలు, పట్టణాల్లో సదస్సులు**





మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 30 ; నేటి శుభోదయ : మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2 నుంచి గ్రామాలు, పట్టణాల్లో మద్యపానం, గుట్కా, పాన్‌పరాగ్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు, పల్నాడు జిల్లా దిశా కమిటీ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు.మద్యపానం, గుట్కా, మాదకద్రవ్యాల వినియోగం కారణంగా అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. వ్యసనాల కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరిగి అనేక కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోతున్నాయని తెలిపారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన మహిళలు, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు పిల్లల చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత సంఖ్యతో పాటు వారి జీవన విధానం, విద్య, ఉపాధి, క్రమశిక్షణ, ఆరోగ్యంపై సమాజం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానం, మాదకద్రవ్యాలు, గుట్కా, పాన్‌పరాగ్, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రజలకు స్పష్టమైన హామీలు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. కుల, మత, భాష, వర్గ, రాజకీయ భేదాలకు అతీతంగా శాంతియుతంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలంటే దేశభక్తి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వజ్ర సంకల్పం కలిగిన యువతను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పేదలు, నిరుపేద పిల్లలు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను ఆదుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో అలాంటి పిల్లలను చేరదీసి, వారి చదువు పూర్తయ్యే వరకు విద్యను అందించే బాధ్యతను స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ తీసుకుంటుందని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. అలాగే మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన న్యాయ సలహాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 'జై భారత్.. లవ్ ఇండియా.. సర్వ్ ఇండియా' అనే స్ఫూర్తితో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో పది సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష జరిమానా

ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ జిల్లా కచువా మండలం కుడ్ ఫర్ కు చెందిన రాజేష్ కిరార్, రాజ్ కుమార్ రాజ్ పుత్, హరి ఓం మరియు ఉత్తర ప్రదేశ్ దాద్రి కి చెందిన పూనందేవిలకు గంజాయి అక్రమశీగా రవాణా చేసిన కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష, తలా ఒక లక్ష జరిమానా చొప్పున విధిస్తూ స్థానిక ఇన్చార్జ్ అదనపు జిల్లా కోర్టు న్యాయ మూర్తి పి.పి.కృష్ణార్జున బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ఖమ్మం రైల్వే పోలీసులు ది 6/ 9/ 2022 న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఖమ్మం రైల్వే ప్లాట్ఫారం నెంబర్ 2 దగ్గర పై నిందితులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారి వద్ద ఆరు బ్యాగులు లభించగా తనిఖీ చేయడంతో అందులో 38 గంజాయి ప్యాకెట్లు లభించాయి. మొత్తం 101 కేజీలుగా తేలింది. గంజాయిని తక్కువ రేటుకు కొని డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ఎక్కువ రేటుకు అమ్మాలని ఇలా అక్రమ రవాణాకు పాల్పడ్డామని తెలుపగా పంచుల సమక్షంలో వారీ వివరాలు తెలుసుకొని గంజాయిని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి, అదే రోజు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి, అనంతరం దర్యాప్తు నిర్వహించి ప్రత్యేక కోర్టు నందు చార్జ్ షీట్ దాఖలు చేయగా ,అట్టి కేసు విచారణకు రాగా సాక్షులను విచారించి, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులు గంజాయిని అక్రమంగా రవాణా చేశారని నిర్ధారించి వారిని పై విధంగా శిక్షిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించగా లైజె న్ అదికారి శ్రీకాంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కోర్ట్ కానిస్టేబుల్ రహీం భాష, గాంధీ కోర్టు హోంగార్డు ఆయుబ్ లు సహకరించారు.

## "లక్ష్యాలను నిర్దేశించుకొని.. దేశభివృద్ధిలో భాగస్వాములు కావాలి ప్రధాని నరేద్రమోడీ కి మద్దతునివ్వాలి సేవాసంకల్ప చిత్రాలేఖనం పోటీల విజేతలకు బహుమతులు"



తాడేపల్లిగూడెం సప్టెంబర్ 30 (నేటి- శుభోదయ) విద్యార్థులు, యువత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని, వికసిత్ భారత్ సాధనలో భాగస్వాములు కావాలని బిజెపి నేతలు పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ 25 సంవత్సరాల పరిపాలన సేవ రైతు ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం మండల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆధ్వర్యంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, దేశ ప్రధానిగా 12 సంవత్సరాలు విశేష సేవలు అందిస్తున్న నరేంద్ర మోడీ పరిపాలన రైతు ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభను ప్రదర్శించినందుకు అభినందించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచిమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా ప్రధానినరేంద్ర మోడీ నిరాటంకంగా దేశ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంతోపాటు దేశం కోసం స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు యువత తమ లక్ష్యాలను నిర్ణయించుకొని వాటికోసం కృషి చేయడంతో పాటు నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు దేశ అభ్యున్నతి కార్యక్రమాల్లో పాల్గొనాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఈ పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, పడాల కావ్య రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్ కుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు సి హెచ్ వి రవి తదితరులు పోటీల నిర్వహణ లో పాల్గొన్నారు.

## అబద్ధాలు, విద్వేషాలు, దూషణలతో కాలక్షేపం, పరిపాలనను గాలికి వదిలేశారు

**: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: సిరిసిల్ల సభలో కేసీఆర్, కేటీఆర్ లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్. అబద్ధాలు, విద్వేషాలు, దూషణలతో కాలక్షేపం చేస్తూ రాష్ట్రంలో పరిపాలనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలికి వదిలేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఆవేశానికి లోనై ఆక్రోశంతో సిరిసిల్ల సభలో కేసీఆర్, కేటీఆర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తూ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి గౌరవం, సంస్కారం పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందని కానీ అందుకు భిన్నంగా వ్యక్తిగత విమర్శలు, అసభ్య పదజాలంతో రేవంత్ రెడ్డి మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, పరిపాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం సిరిసిల్ల సభలో రేవంత్ రెడ్డి చేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

## అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా పబ్లిక్ హియరింగ్..

**కలర్ గ్రానైట్ ప్రాజెక్టులకు స్థానికుల పూర్తి మద్దతు**




అన్నమయ్య జిల్లా సెప్టెంబర్ 30 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : అన్నమయ్య జిల్లా (పూర్వపు చిత్తూరు జిల్లా) పరిధిలోని వాల్మీకిపురం మండలం, బూడిదవేడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయతలపెట్టిన కలర్ గ్రానైట్ పరిశ్రమలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) సమావేశం అత్యంత ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో భాగంగా మెస్సర్స్ ఫిగ్ ఎంటర్‌ప్రైజ్ ఎల్‌ఎల్‌పి సంస్థ తరఫున సర్వే నెం. 428/5 (పాత సర్వే నెం. 428/1) లో 2.450 హెక్టార్లు, అలాగే మెస్సర్స్ అబుదాన్షియా ఎంటర్‌ప్రైజ్ ఎల్‌ఎల్‌పి సంస్థ తరఫున సర్వే నెం. 428/1పి (పాత సర్వే నెం. 428/1) లో 2.064 హెక్టార్ల విస్తీర్ణంలో కలర్ గ్రానైట్ త్రవ్వకాలకు ప్రతిపాదించిన ప్రాజెక్టుల వివరాలను అధికారులు, నిర్వాహకులు ప్రజల ముందుంచారు. ?ఈ ప్రతిపాదనలపై స్థానిక ప్రజలు ఎంతో సానుకూలంగా స్పందించారు. గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రాజెక్టుల ఏర్పాటుకు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఇలాంటి పరిశ్రమలు రావడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తమ ప్రాంతం ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుల వల్ల పర్యావరణానికి గానీ, తమ దైనందిన జీవితానికి గానీ ఎలాంటి ఇబ్బందులు లేవని, దీనిపై తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని వారు స్పష్టం చేశారు. ?ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు పరిశ్రమల యాజమాన్యాలపై ఎంతో నమ్మకంతో మద్దతు తెలుపుతున్నారని, ఆ నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. నిబంధనలకు లోబడి పనులు చేస్తూ, స్థానిక అభివృద్ధికి, సంక్షేమానికి సంస్థలు పాటుపడాలని కోరారు.



ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా గోళ్ల మురళి ఏకగ్రీవ ఎన్నిక

**తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు వెల్లడి**



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోళ్ల మురళి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు బుధవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదు లో జరిగిన ముఖ్యుల సమావేశంలో రాష్ట్ర రేషన్ డీలర్ల నూతన రాష్ట్ర కమిటీ నిర్మాణంలో భాగంగా ఖమ్మం జిల్లా నుండి ఖమ్మం పట్టణ రేషన్ డీలర్ మాజీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఖమ్మం పట్టణ కోశాధికారి గా విధులు నిర్వహిస్తున్న గోళ్ళ మురళి ని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు భావాలు ఉన్న గోళ్ళ మురళి రాష్ట్ర రేషన్ డీలర్ల వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆయనను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర, ఖమ్మం జిల్లా రేషన్ డీలర్లు ముఖ్య నాయకులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గోళ్ళ మురళి మాట్లాడుతూ ఈ పదవి తనకు మరింత బాధ్యతను పెంచిందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాననీ పేర్కొన్నారు.

# రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు

**– క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచి 111 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాల్లో 12 బంగారు, 9 వెండి, 6 కాంస్య పతకాలు సాధించి మొత్తం 27 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విజేతలైన యువ క్రీడాకారులను అభినందించారు. మారుమూల గ్రామాల్లో నివసిస్తూ కనీస వసతులు, సదుపాయాలు అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టడం ఎంతో గర్వకారణమని అన్నారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలతో పాటు చదువుపై కూడా సమానమైన శ్రద్ధ చూపుతూ విద్యలోనూ రాణించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని సూచించారు.జిల్లా యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటిన క్రీడాకారులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# ‘రైతుల సంక్షేమమే ధ్యేయంగా పీఏసీఎస్ సేవలు…’

**– దోసకాయలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం.**

**సొసైటీ చైర్‌పర్సన్ సూదిన గంగాధర్ అధ్యక్షతన నిర్వహణ**




కోరుకొండ, సెప్టెంబర్ 30: నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)– దోసకాయలపల్లి గ్రామీణ ప్రాంత రైతులకు ఆర్థికంగా చేయూతనందిస్తూ, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రధాన లక్ష్యమని సొసైటీ చైర్‌పర్సన్ సూదిన గంగాధర్ అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమిత సంఘం సాధారణ సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్‌పర్సన్ సూదిన గంగాధర్ అధ్యక్షతన గురువారం వేడుకగా జరిగింది.ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ కొయ్యాల శివ అప్పలరాజు సంఘానికి సంబంధించిన వార్షిక లావాదేవీలు, ఆర్థిక స్థితిగతులను సభ్యులకు క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుతం సంఘంలో 543 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఆర్థిక వివరాలు రుణాలు: నగదు నిల్వ (సిరి దినము): 1,29,71,652 పంట రుణాలు 1,37,70,961హ్రస్వకాలిక రుణాలు 4,05,04,650 దీర్ఘకాలిక రుణాలు 2,37,00,931 రైతు నేస్తం మొత్తం రుణాలు: 4,93,08,933 కొత్తగా మంజూరు చేసిన రైతు నేస్తం రుణాలు: 28,11,000 ఎరువుల వ్యాపారం ద్వారా వచ్చిన నికర లాభం: 18,116 సొసైటీ ద్వారా అందిస్తున్న రుణ సదుపాయాలు మరియు ఎరువుల పంపిణీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణ సహాయం అందించడంలో సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పాలకమండలి సభ్యులు, డైరెక్టర్లు, సంఘ సభ్యులు మారిన రాము మారిన బుజ్జి మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

# విలేకరి ఇంటిపై దాడికి యత్నం

**– పోలీసులకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల ఫిర్యాదు**




తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: తిరుమలాయపాలెం మండలం లోని ముజాహిద్‌పురం గ్రామం లో పేకాట నిర్వహిస్తున్నారంటూ వార్త రాసిన నేపథ్యంలో ఓ విలేకరి ఇంటి వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని విలేకరి గుజ్జ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముజాహిద్‌పురంలో పేకాట జరుగుతున్నట్లు రామకృష్ణ వార్త రాశారు. అనంతరం కొందరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కుటుంబసభ్యులు భయాందోళనకు గురయ్యారని తెలిపారు. తనపై దాడికి యత్నించినట్లు పేర్కొంటూ పుల్లూరి నాగరాజు (36), పుల్లూరి వినయ్‌కుమార్ (25), పుల్లూరి చరణ్‌కుమార్ (20), చింత హరీష్ (25), చింత నవీంద్ర (25)లపై ఆయన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన రెండో ఎస్ఐ విచారణ చేపట్టారు. పూర్తి వివరాలను సేకరించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. వార్తలు రాస్తున్న విలేకరులను బెదిరించడం, దాడులకు పాల్పడటం సరికాదని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. విలేకరులకు రక్షణ కల్పించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# “ప్రజల పక్షాన నిలబడటమే అసలైన రాజకీయం

**: మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ”**

**తాడేపల్లిగూడెం అక్రమాలకు అడ్డాగా మారింది.**

**ప్రజల పక్షాన పోరాడలేని అసమర్థుడు ప్రతిపక్ష నేత**

**గూడెంలో నలుగురు ముఖ్యనేతలపై నిప్పులు చెరిగిన “కొట్టు”**




తాడేపల్లిగూడెం,సెప్టెంబర్ 30 (నేటి -శుభోదయ): ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు వారి పక్షాన నిలబడి, వారికి అండగా ఉన్నామనే ధైర్యాన్ని కల్పించడమే ప్రతిపక్షం బాధ్యత అని, అదే అసలైన రాజకీయమని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.కూటమి నేతల అక్రమాలను ప్రశ్నించలేని బలహీనుడు ప్రతిపక్ష వైసిపి నేత ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వై.యఎస్. ఆర్.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వ అక్రమాలపై రాష్ట్రస్థాయిలో నిరంతరం తీవ్రమైన పోరాటం చేస్తున్నారని, తాడేపల్లిగూడెంలో మాత్రం అందుకు విరుద్ధంగా వైసీపీ బలహీనంగా ఉండటం బాధ కలిగిస్తుందని అన్నారు. తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ రోడ్డులో టాక్సీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టాక్సీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల కార్యక్రమంలో వందలాది మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించడం సంతోషకరమన్నారు. ఐకమత్యంతో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంత గొప్పగా ఉంటుందో టాక్సీ స్టాండ్ ఓనర్స్, వర్కర్స్ నిరూపించారని పేర్కొన్నారు.టాక్సీ ఓనర్లు, వర్కర్లు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో టాక్సీ వర్కర్లకు పన్నులు, వాహనాల రెన్యూవల్స్ కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేదని అన్నారు .33 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న టాక్సీ సంఘానికి,స్థలం విషయంలో సహకరించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తాడేపల్లిగూడెంలో రాజకీయ పరిస్థితి గురించి ఆయన మాట్లాడుతూ డబ్బులతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. తాత్కాలికంగా ఐదో, పదో ఇచ్చి డబ్బులు, మేనేజ్‌మెంట్లతో వ్యవహారాలను నడిపించడమే రాజకీయమని భావించే పరిస్థితి ప్రస్తుతం ఉందని విమర్శించారు.అసలు రాజకీయం అంటే ప్రజల పక్షాన ధైర్యంగా నిలబడటమేనని స్పష్టం చేశారు.ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు “మేమున్నాం.. మీ వెనకాల ఉన్నాం” అనే ధైర్యాన్ని ప్రతిపక్ష నాయకులు కల్పించాలని అన్నారు. అధికార పక్షం చేసే తప్పులను ప్రశ్నించేందుకు తాము ఉన్నామనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాల్సిన బాధ్యత ప్రతిపక్షం పై ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగినా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల పక్షాన నిలబడినప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూడా వైసిపి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని అన్నారు. కేవలం ఏదో ఒక కార్యక్రమం నిర్వహించి,పైపై మాటలు చెప్పడం సమర్థ వంతమైన రాజకీయం కాదని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజలు అనేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.కోట్లాది రూపాయల విలువైన ఆస్తులపై అసాంఘిక శక్తులు దురాక్రమణకు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తుల వివాదాల్లో ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని విమర్శించారు. ఎవరో ఒక వ్యక్తి దగ్గర సెటిల్‌మెంట్ చేసుకోవాలని పోలీసులు చెబుతున్నారంటూ ఆరోపించారు. పోలీసులపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్టు తెలుస్తుందన్నారు. ప్రత్యక్షంగా కనిపించకపోయినా అసాంఘిక శక్తుల వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టాక్సీ ఓనర్లు, వర్కర్లకు ప్రశాంతమైన వాతావరణం లేదని అన్నారు. గత రెండున్నరేళ్లలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆరోపించారు.రాజకీయ నాయకుల అండతో కొన్ని బ్యాచ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మద్యం, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.తాడేపల్లిగూడెంలో పారిశుధ్యం,అభివృద్ధి లేదని కూటమి నాయకుడే మీడియాలో విమర్శించటం పరిస్థితికి అద్ధం పడుతుందన్నారు. కూటమిలో మరో పార్టీ నాయకుడు తమ వద్ద వాషింగ్ మిషన్ ఉందని ఎవరు వచ్చినా శుభ్రం చేసేసి బొట్టు పెట్టేస్తామని అంటున్నారని ఏద్దేవా చేశారు.కూటమి నాయకుల మధ్య భిన్నమైన వ్యాఖ్యలు వారి అసమర్థ నిర్వాకానికి నిదర్శనమని అన్నారు. వాలంటీర్ వ్యవస్థను తొలగించిన తర్వాత ఆ వ్యవస్థకు సంబంధించిన పనులను సచివాలయ ఉద్యోగులపై మోపుతున్నారని విమర్శించారు.ఆదివారాలు,సెలవు రోజుల్లో కూడా వారితో పని చేయిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ 1.35 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు.సచివాలయ ఉద్యోగులు జగన్‌మోహన్‌రెడ్డి వర్గానికి చెందినవారనే భావనతో ప్రస్తుత ప్రభుత్వం వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గతంలో చెప్పిన మాటలకు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ఎన్నికలు జరిగి రెండున్నరేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు.పెన్షన్లను కొత్తగా ఇస్తున్నట్టుగా ప్రచారం చేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.మరో రెండున్నరేళు ప్రజలు ప్రస్తుత పరిస్థితులను భరించాల్సి వస్తుందని,రాబోయే రోజుల్లో మంచి రోజులు వస్తాయని ప్రజలకు భరోసా ఇచ్చారు.నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటామని కొట్టు సత్యనారాయణ తెలియజేశారు.

# అనంతపురం ఆర్ట్స్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఘనంగా “గ్లోబల్ హార్టికల్చర్ హబ్

**– రాయలసీమ రైజింగ్” ఔట్ రీచ్ కార్యక్రమం.**

**– జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ పై ఎల్ఈడీ షో ద్వారా అవగాహన వీడియో ప్రదర్శన.. విశేష స్పందన.. –కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, హార్టికల్చర్ డిడి ధనుంజయ్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, తదితరులు..–అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్‌గా ‘అనంత’ : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ..– రాయలసీమకు హార్టికల్చర్ వరం: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్..**

అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 30 :నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో బుధవారం రాత్రి “గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్” ఔట్ రీచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా.. ఇందులో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ పై ఎల్ఈడీ షో ద్వారా అవగాహన వీడియో ప్రదర్శన కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ డ్రోన్ పై ఎల్ఈడీ షో ద్వారా అవగాహన వీడియో ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, హార్టికల్చర్ డిడి ధనుంజయ్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామనాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా దాదాపు 28 రకాల పండ్ల తోటలను పండిస్తూ రాష్ట్రానికి ‘ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ’గా, అలాగే దేశంలోనే ఒక తలమానికమైన ప్రాంతంగా గుర్తింపు పొందిందన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్ పేరుతో రాయలసీమ మొత్తానికి ఉపయోగపడేలా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2న (గాంధీ జయంతి రోజున) మదనపల్లెలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. మొత్తం1,00,000 కోట్లతో చేపట్టే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ?40,000 కోట్లు అందించనుండగా, మరో 60,000 కోట్లను ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా సమీకరించనున్నారన్నారు. హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్ ద్వారా రాయలసీమలో పండే ప్రతి పంటకు రక్షణ కల్పించి, మార్కెట్‌లో మంచి ధర లభించేలా చూస్తారన్నారు. రైతులకు సాగునీరు, రోడ్లు, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలు కల్పిస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తారన్నారు. ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాపై ప్రత్యేక ప్రేమతో నిధులు కేటాయిస్తున్నారని, ఇందులో భాగంగా హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువల వెడల్పు కార్యక్రమానికి రూ.3 వేల కోట్లకుపైగా బడ్జెట్ కేటాయించారని తెలిపారు. రాయలసీమ జిల్లాలు మరియు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను కలుపుతూ గ్లోబలైజేషన్ స్థాయి మార్కెట్ సదుపాయాలతో ఒక అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారన్నారు. అనంతపురం జిల్లాలోని ఎర్రనేలల్లో నీటి సదుపాయం కల్పిస్తే ఏ పంటైనా సమృద్ధిగా పండుతుందని, హిమాచల్ ప్రదేశ్‌లో పండే ఆపిల్స్‌ను కూడా ఇక్కడ పండిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు ఆర్థిక సమస్యలు తగ్గి, పండ్ల తోటల సాగు మరింత విస్తరిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ హార్టికల్చర్ అనేది రాయలసీమ ప్రాంతానికి ఒక వరం అని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు హార్టికల్చర్ రూపంలో దేవుడిలా వరం ఇచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, వెనుకబడిన అనంతపురం జిల్లాకు (హంద్రీ–నీవా) నీళ్లను తీసుకొచ్చి, భూగర్భ జలాలను పెంచడంతో పాటు చెరువులను నింపే కార్యక్రమాలు చేపట్టారన్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్ట్ నీటి ద్వారా అనంతపురం జిల్లాను భారతదేశంలోనే హార్టికల్చర్‌లో నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిదేనని పేర్కొన్నారు. 2014–19 మధ్య ఎంబిబిసిగా ఉన్న సమయంలో అత్యంత వెనుకబడిన రాప్తాడు మండలానికి హంద్రీ–నీవా నీళ్లు ఇవ్వడం వల్ల, ఈరోజు అక్కడ అరటి, టమోటా, వెజిటబుల్స్ వంటి అనేక పంటలు పండుతూ, ఒక్క ఎకరా కూడా ఖాళీ లేకుండా సాగవుతోందన్నారు. గతంలో 1800 క్యూసెక్కులు మాత్రమే ఉన్న హంద్రీ–నీవా సామర్థ్యాన్ని, రూ. 3,500 కోట్లు ఖర్చు చేసి 100 రోజుల్లోనే కాలువలను వెడల్పు చేయడం ద్వారా 4,000 క్యూసెక్కులకు పెంచి, శ్రీశైలం నుండి దాదాపు 60–70 టిఎంసిల నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. రాయలసీమ నేలలో పండే పంటలు చాలా రుచికరంగా ఉంటాయని, ఏ మార్కెట్‌కు వెళ్లినా ‘అనంతపురం ఫుడ్’ అంటే రూపాయి ఎక్కువ పలుకుతుంది, త్వరగా అమ్ముడవుతుందన్నారు. జిల్లాలోని తాడిపత్రి ప్రాంతం నుండి అరటి ఎగుమతి చేయడానికి ఎంపీ గారు ప్రత్యేకంగా రైలు సౌకర్యం కల్పించి, వేలాది టన్నుల అరటిని ఎగుమతి చేయించారన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్– ‘రైజింగ్ రాయలసీమ ’గా తీర్చిదిద్దేందుకు రూ. 40,000 కోట్ల ప్రభుత్వ పెట్టుబడి, పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ఔౌ) మోడల్‌లో మరో రూ. 60,000 కోట్లతో మొత్తం లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల టార్గెట్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమం మదనపల్లెలో అక్టోబర్ 2న అధికారికంగా ప్రారంభమవుతోందన్నారు. అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాలకు హార్టికల్చర్ ఆధారిత పరిశ్రమలను, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్‌ను పెద్ద ఎత్తున తీసుకువస్తున్నారన్నారులిఅనంతరం డ్రోన్ పై ఎల్ఈడీ షో ద్వారా అవగాహన వీడియో ప్రదర్శనను ఎంపీ, ఎమ్మెల్యే, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వీడియో ప్రదర్శనను సెల్ ఫోన్ లలో బంధించి చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. డ్రోన్ పై షో ద్వారా అవగాహన వీడియో ప్రదర్శన కొత్తగా ఉందని డిఐపిఆర్ఓని ఎంపీ ఎమ్మెల్యేలు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐ.అండ్.పీఆర్ డిపిఆర్ఓ ప్రభాకర్, ఎపిఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణరెడ్డి, ఉద్యాన, వ్యవసాయ శాఖ, ఎపిఎంఐపి శాఖ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# రాకేష్‌కు కన్నీటి వీడ్కోలు, కదిలొచ్చిన జనసంద్రం



తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కాకరవాయి గ్రామానికి చెందిన పోలీస్ వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్‌కు కాకరవాయి ప్రజలు రాజకీయాలకు అతీతంగా కన్నీటి పర్యంతమై అపూర్వమైన రీతిలో అంతిమ వీడ్కోలు పలికారు. చిన్న వయసులోనే విధి నిర్వహణలో మృత్యువాత పడిన రాకేష్‌ను చివరిసారి చూసేందుకు, అతడికి కడసారి వీడ్కోలు పలికేందుకు కాకరవాయి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది తరలిరావడంతో కాకరవాయి జనసంద్రంగా మారింది. రాకేష్ అంతిమయాత్రలో ఇసుకవేస్తే రాలనంతగా జనం కనిపించడంతో గ్రామంలో ఎటుచూసినా విషాదం, జనసందోహమే దర్శనమిచ్చింది.రాకేష్ అంతిమయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రజలు పెద్ద సంఖ్యలో వెంట నడిచారు. ముందుకు సాగుతున్న అంతిమయాత్ర వెనుక వేలాది అడుగులు కదిలాయి. కాకరవాయి గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాకేష్‌ను కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికారు. రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోవడంతో రాకేష్‌పై స్థానిక ప్రజలకు ఉన్న అభిమానం, ఆప్యాయత స్పష్టంగా కనిపించింది.సాధారణంగా జరిగే అంతిమయాత్రలకు భిన్నంగా రాకేష్‌కు చివరి వీడ్కోలు పలికేందుకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొంది. డీజే చప్పుళ్లు, కోలాటాలతో పాటు బాణసంచా కాల్చుతూ రాకేష్‌కు ఘనమైన వీడ్కోలు పలికారు. విషాదంతో నిండిన వాతావరణంలోనూ రాకేష్‌పై తమకున్న ప్రేమ, స్నేహం, అనుబంధాన్ని చాటుకునేలా యువత ముందుండి అంతిమయాత్రలో పాల్గొంది. రాకేష్ పేరును స్మరిస్తూ పలువురు భావోద్వేగానికి గురికాగా, మరికొందరు కన్నీటిని ఆపుకోలేకపోయారు.కుటుంబానికి చెందిన సుమారు 10 గుంటల సొంత భూమిలోనే రాకేష్ అంత్యక్రియలు నిర్వహించడం మరింత భావోద్వేగాన్ని నింపింది. తన జీవితంలో ఎన్నో జ్ఞాపకాలను మోసిన కాకరవాయి నేలపైనే రాకేష్ చివరి ప్రయాణం ముగిసింది. ఒకప్పుడు తన అడుగులతో తిరిగిన అదే నేలపై చివరకు శాశ్వత నిద్రలోకి వెళ్లడం చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. రాకేష్ భౌతికకాయాన్ని చివరిసారి చూసిన పలువురు కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు ప్రయత్నించినా వారి కన్నీళ్లను ఆపలేకపోయారు.రాకేష్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కష్టపడి జీవించే కుటుంబం నుంచి వచ్చిన రాకేష్ చిన్న వయసులోనే పోలీస్ వాహన డ్రైవర్‌గా విధుల్లో చేరి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. స్నేహితులతో, బంధువులతో, గ్రామస్థులతో ఆప్యాయంగా మెలిగే రాకేష్ ఇక లేడన్న వార్తను పలువురు జీర్ణించుకోలేకపోయారు. తమతో కలిసి నవ్విన యువకుడు, తమతో కలిసి తిరిగిన స్నేహితుడు, తమ గ్రామానికి చెందిన బిడ్డ ఇక తిరిగిరాడన్న వాస్తవాన్ని తలచుకుని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.రాకేష్‌ను చివరిసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వాహనాలు, ద్విచక్రవాహనాలు, కాలినడకన వచ్చిన ప్రజలతో కాకరవాయి పరిసర ప్రాంతం మొత్తం జనంతో నిండిపోయింది. కాకరవాయి నుంచి అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగిన అంతిమయాత్రలో జనప్రవాహం కనిపించింది. ముందుకు సాగుతున్న రాకేష్ అంతిమయాత్రకు ప్రజలు వరుసగా చేరుతూనే ఉండటంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.తన జీవితం ముగిసిపోయినా రాకేష్‌పై ప్రజలకు ఉన్న అభిమానం మాత్రం అంతిమయాత్రలో స్పష్టంగా కనిపించింది. చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రాకేష్‌కు కాకరవాయి ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలకడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కన్నీళ్లతో కుటుంబ సభ్యులు, విషాదంలో గ్రామస్థులు, అభిమానంతో కదిలొచ్చిన ప్రజలు.. డీజే చప్పుళ్లు, కోలాటాలు, బాణసంచా మధ్య సాగిన రాకేష్ అంతిమయాత్ర కాకరవాయిలో ఎన్నటికీ మరచిపోలేని విషాద ఘట్టంగా మిగిలిపోయింది.





# రూ.17 లక్షల కు కిరాణా వ్యాపారి ఐపీ

ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరానికి చెందిన కిరాణా వ్యాపారి వందనం కాశి విశ్వనాధం స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.17,00,000 /- కు ఐపీ దాఖలు చేశారు. మొత్తం 15మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ విశ్వనాధమ్ ఖమ్మం పట్టణంలో కిరణా వ్యాపారం చేసివాడు. ఈ వ్యాపారాన్ని అబివృద్ధి చేయడం కోసం అధిక వడ్డీ లకు బంధువుల దగ్గర స్నేహితులు దగ్గర అధిక మొత్తంలో అప్పులు తీసుకున్నాడు. ఈ వ్యాపారం లో తీవ్ర నష్టాలు రావడంతో బాకీలు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని, తనను దివాలాదారుని గా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది కొలకలూరి ప్రసాద్ ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

# వరల్డ్ హార్ట్ డే వేడుకల్లో జర్నలిస్ట్ మాగులూరి రాంబాబుకు ఘన సత్కారం

**కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సన్మానం.. డాక్టర్ ఎం. సంజీవరావు బృందానికి అభినందనలు**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 30; నేటి శుభోదయ : వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన జర్నలిస్ట్ మావులూరి రాంబాబును ఘనంగా సత్కరించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని హోటల్ ఆమంత్రన్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్డియాక్ క్రిటికల్ కేర్ సర్జన్ డాక్టర్ ఎం. సంజీవరావు తదితరులు రాంబాబును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. తన గుండె సమస్యకు శస్త్రచికిత్స సాధ్యం కాదని పలువురు వైద్యులు చెప్పినప్పటికీ, డాక్టర్ ఎం. సంజీవరావు, ఆయన వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితం అందించారని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది అందించిన ఆత్మీయ సేవలు మరువలేనివని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం. సంజీవరావుతో పాటు కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సూర్యప్రకాష్‌రావు, డాక్టర్ జాన్ క్రిస్టఫర్, డాక్టర్ గ్రేస్ తదితరులను కేర్ హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ భారతి అభినందించి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో సిస్టర్ జెట్టి ప్రసన్నలత, దయాకర్, రాధిక, చారి తదితరులు పాల్గొన్నారు.



# స్వర్గీయ తోరాటి అనంతలక్ష్మి వర్ధంతి వేడుకల్లో పేదలకు వస్త్రాలు పంపిణీ చేసిన రైతు నాయకుడు తోరాటి శ్రీనివాస్..



కోరుకొండ, సెప్టెంబర్ 30: నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన స్వర్గీయ తోరాటి అనంతలక్ష్మి వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం జిల్లా నాయకులు, ఆమె కుమారుడు తోరాటి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద వృద్ధులు, మహిళలు, నిరుపేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.కోరుకొండమండలం గాదరాడ గ్రామంలో సుంకర గంగరాజు, సీతయమ్మ దంపతులకు అనంతలక్ష్మి జన్మించ్చారు. అదే స్వగ్రామానికి చెందిన తోరాటి సుబ్బారావు, నాగరత్నం దంపతుల కుమారుడు రాంబాబుతో 1980లో వివాహం జరిగింది...అనంతలక్ష్మికి ముగ్గురు కుమారులు. తోరాటి శ్రీను, సత్యనారాయణ, దుర్గాప్రసాద్ కలరు. గృహిణి గా తమ జీవిత శైలిని కొనసాగించు సమయంలో 1990వ సంత్సరంలో శ్రీ కనకదుర్గ అమ్మవారు ఆమెకి స్వప్నంలో కనిపించి గాదరాడ ఊరు శివారులో రోడ్డు ప్రక్కన ఉన్న వేప చెట్టు దగ్గర తనకి గుడి కట్టించు అని చెప్పి ఆ చెట్టులో అమ్మవారు ఐక్యము అయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుండి అనంతలక్ష్మిపై అమ్మవారు రావడం జరిగింది. 1993వ సంత్సరంలో గుడి నిర్మాణం జరిగిందని తోరాటి శ్రీనివాస్ వివరించారు. అప్పటి నుండి అమ్మవారి సేవలో, అమ్మవారి దాసురాలుగా కొనసాగుతువచ్చారు. గ్రామ ప్రజలందరు కూడా ఒక అమ్మవారిగా భావించి, ఒక ఇంటి ఆడపడుచు గా భావించి మంచి చెడ్డలకి, సూచనలకు, శుభాకార్యక్రమాలకి ఆవిడ ఆశీస్సులు ఉండాలని కోరుకొనేవారు. గ్రామప్రజలు, గ్రామపెద్దల సహాయ సాకరాలతో శ్రీ కనకదుర్గ అమ్మవారి జాతర జరిపించేవారు. అలా కొనసాగుతున్నతరుణంలో దురదృష్టం శాత్తు 30/09/2023న సాయంత్ర గుండె పోటుతో మరణించారు. అనంతలక్ష్మి ఏ లోకమంలో ఉన్నగాని వారి ఆశీస్సులు, మాకు, మా గ్రామప్రజలకు ఎల్లప్పుడు ఉండాలని మేము మనస్ఫూర్తిగా కోరుకొంటున్నామని శ్రీనివాస్ వెల్లడించారు.

# పోషణ్ మాహ్--2026 సందర్భంగా పోషకాహార అవగాహన




విజయవాడ, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ : శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పోషణ్ మాహ్--2026 కార్యక్రమాలు నిర్వహించారు.భారత ప్రభుత్వ మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ ఏడాది పోషణ్ మాహ్‌కు "హమారీ అంగన్‌వాడీ -- హమారీ జిమ్మేదారీ"అనే ప్రధాన ఇతివృత్తాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 7న ఫకీరుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు మరియు బాలింతల కోసం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.,ఈ కార్యక్రమంలో సమతుల్య ఆహారం, తల్లుల ఆరోగ్యం, సరైన ఆహార ఎంపికలు, గర్భధారణ మరియు బాలింతల దశలో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు పండ్లు పంపిణీ చేసి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు.ఈనెల 24న కళాశాల విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు 'న్యూట్రి-ఫెస్ట్' నిర్వహించారు. వివిధ న్యూట్రిషనల్ గేమ్స్ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాలు, ఆహార వర్గాలు మరియు సమతుల్య ఆహార ఎంపికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫుడ్ సోర్టింగ్ , ఫ్రూట్ పజిల్ , న్యూట్రిషన్ స్క్రాంబలింగ్ , బ్లైండ్ ఫోల్డ్ : ఇంగ్రెడింట్స్ ఐడెంటిఫికేషన్ , నాలుగు విద్యాపరమైన ఆటలను నిర్వహించారు. ఆటల ద్వారా నేర్చుకునే విధానాన్ని అనుసరించి విద్యార్థుల్లో పోషకాహారంపై ఆసక్తిని పెంపొందించారు.సోమవారం విద్యార్థులు న్యూట్రిషనల్ స్నాక్స్ డెవలప్మెంట్ అండ్ ఇంట్రెప్రెనేర్షిప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషక విలువలు కలిగిన ఆహార ఉత్పత్తుల తయారీ, అలంకరణ, ప్రదర్శన మరియు మార్కెటింగ్‌పై విద్యార్థులు ప్రాయోగిక నైపుణ్యాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో చాక్లెట్ కేక్, ఓట్స్--యాపిల్ సినమన్ కుకీస్, కాఫీ మఫిన్స్), కొబ్బరి బిస్కెట్లువంటి న్యూట్రిషన్ స్నాక్స్ తయారు చేశారన్నారు. ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పై తమకున్న పరిజ్ఞానాన్ని సృజనాత్మకతతో అన్వయిస్తూ, వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకునేలా ఈ కార్యక్రమం దోహదపడుతుంద న్నారు.పోషణ్ మాహ్--2026 కార్యక్రమాల



ద్వారా సమాజంలో పోషకాహార అవగాహన, విద్యార్థుల్లో ఆచరణాత్మక అభ్యాసం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రోత్సాహం మరియు ఆహార ఉత్పత్తుల తయారీలో సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేశారు.

# ప్రైవేట్ పనులకు ప్రభుత్వ వాహనం




ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: కొత్తగూడెం జిల్లా జనరల్ ఆస్పత్రికి సంబంధించిన అంబులెన్స్ ను హాస్పిటల్ కు చెందిన సూపరింటెండెంట్ డాక్టర్ రాధా మోహన్ ప్రైవేట్ పనులకు వాడుకుంటూ విధులను దుర్వినియోగ పరుస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాల్సిన అంబులెన్స్ లో జిజిహెచ్ సూపరింటెండెంట్ తన ప్రైవేట్ పనుల కోసం రోజుకు నాలుగు నుండి ఐదు సార్లు గణేష్ టెంపుల్ ప్రాంతంలో తిరుగుతూ ఉన్నారు.దీనికి కారణం గణేష్ టెంపుల్ ప్రాంతంలో సదరు సూపరింటెండెంట్ కు ప్రైవేట్ క్లినిక్ ఉండడమే. ప్రైవేట్ క్లినిక్ కు ప్రభుత్వ వాహనాన్ని వాడుకుంటూ రోడ్డుపైనే ఆ వాహనాన్ని గంటలకు పైగా నిలిపివేసి తన ప్రైవేట్ క్లినిక్ లో వైద్యం చేస్తున్నాడని విమర్శలు ఉన్నాయి. బాధ్యతాయుతమైన అధికారి బాధ్యతలను మరిచి తన సొంత పనులకు ప్రభుత్వ వాహనాన్ని వాడుకోవడం పలు విమర్శలకు దారి తీస్తుంది.

# ఖమ్మం కార్పొరేషన్‌లో పౌర సేవలు ఆటంకం

**- వీధిలైట్లు, పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : బీఆర్ఎస్ నగర నాయకులు**



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో నెలల తరబడి వీధిలైట్లు వెలగకపోవడం, పారిశుధ్య సమస్యలు పేరుకుపోవడం, పౌర సేవలు సక్రమంగా అందకపోవడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం ఖమ్మం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రధానంగా నగరంలోని పలు డివిజన్లలో మూడు, నాలుగు నెలలుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, పాడైన లైట్లకు మరమ్మతులు చేయడం లేదా కొత్త లైట్లు ఏర్పాటు చేయడం లేదని నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక చెత్త, మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పరిమితమవుతున్నారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని, అయితే క్షేత్రస్థాయిలో పౌర సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి అవసరమని అన్నారు.గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో తెల్లవారుజామునే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులను వెంటబెట్టుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులను అప్రమత్తం చేసేవారని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు.ప్రస్తుతం వీధిలైట్లు, పారిశుధ్యం, పౌర సేవలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక పౌర సేవలను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కొనసాగితే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, పసుమర్తి రామమోహన్ రావు, బత్తుల మురళి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థాన నూతన ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకారం

**-కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు**

**-గుడివాడ ఆధ్యాత్మిక వైభవంలో భీమేశ్వర స్వామి ఆలయానికి విశిష్ట స్థానం:ఎమ్మెల్యే రాము**



గుడివాడ, సెప్టెంబర్ 30 నేటి శుభోదయ: గుడివాడ పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో ప్రసిద్ధిగాంచిన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా పట్టపు చిన్నాతో పాటు ఇతర కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.ప్రమాణ స్వీకారం అనంతరం నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు,

ఆలయ అధికారులు, భక్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శ్రీ భీమేశ్వర స్వామివారూ, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్మకర్తల కమిటీ అభినందన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ పట్టణ ఆధ్యాత్మిక వైభవంలో శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానానికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయం భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ధర్మకర్తల కమిటీ ఆలయ సంప్రదాయాలు,

పవిత్రతను కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దాతలు, భక్తులు,అందరి భాగస్వామ్యంతో ఆలయ వైభవాన్ని మరింత పెంచేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాల కల్పనకు నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. శ్రీ భీమేశ్వర స్వామివారి ఆశీస్సులతో రాబోయే శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులుగా పెన్నేరు విశ్వనాథ్ రావు, తీళ్ళ సూర్యనారాయణ, దొండపాటి నాగరాజు, గేదల కళ్యాణి, వి మాధురీ లత, వై సుశీల, మాదాల సునీత, ముప్పిడి ఉమ, పాతపాటి శ్రీవిద్య ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,

దేవదయ శాఖ ఇన్స్పెక్టర్ వి.సుధాకర్, ఆలయ ఈవో కందుల గోపాలరావు,టిడిపి నాయకులు దింట్యాల రాంబాబు, గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, పోలాసి ఉమా, ముల్లపూడి రమేష్, దేవరపల్లి కోటి,

కోడూరు ప్రభు, చిట్టిబాబు, గడ్డం దాస్, జబీన్, సయ్యద్ గఫార్, బిజెపి నాయకులు అంగడాల సతీష్, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, సాయన రాజేష్, కనకదుర్గ, కల్పన, విజయ, నాగరాణి, వెంకటేష్, సాయి పవన్, సుంకర వెంకట్, కిరణ్, ప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 44 వ డివిజన్ లో సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ



ఖమ్మం, సెప్టెంబర్ 30, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ సూచనల మేరకు 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ సహకారంతో లబ్ధిదారులకు చెక్కుని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

**మున్సిపల్, పంచాయతీ ఎన్నికలపై టీడీపీ విస్తృతస్థాయి సమావేశం..**

**వార్డుల వారీగా కార్యాచరణకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి దిశానిర్దేశం..**

తాడిపత్రి మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో టీడీపీ ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించింది. పట్టణంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు ఏరాసు ప్రతాప్ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు పాల్గొన్నారు.సమావేశానికి ముందు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని, వార్డుల వారీగా ఇన్‌ఛార్జ్‌లను నియమించి ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఏకగ్రీవమైన పంచాయతీలు ఇప్పుడు కూడా ఏకగ్రీవం కావాలని అన్నారు. గత ఎన్నికల్లో నామినేషన్లు వేసిన వారిని బలవంతంగా ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. గతంలో జరిగిన పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే ప్రజాక్షేత్రంలోనే తమ కార్యకర్తలు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల కోసం తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, జేసీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నిర్వహించిన ఈ సమావేశంతో తాడిపత్రిలో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# కర్నూలు వంతెనల పరిసరాల్లో పరిశుభ్రతకు రక్షణ

**- మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు**

కర్నూలు : కర్నూలు నగరంలో నదులపై ఉన్న వంతెనల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, వంతెనల వద్ద ప్రజలు చెత్త వేయకుండా, అపరిశుభ్రతకు తావులేకుండా రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారం ఆనంద్ టాకీస్ వద్ద హంద్రీ నదిపై ఏర్పాటు చేస్తున్న రక్షణ వలయాన్ని కమిషనర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని ఆనంద్ టాకీస్ సమీపంలో, రాజ్ విహార్, జొహరాపురం ప్రాంతాల్లో హంద్రీ నదిపై, అశోక్ నగర్, కేవీ కళాశాల ప్రాంతాల్లో కేసీ కెనాల్‌పై ఉన్న వంతెనలకు రూ.52 లక్షలతో రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రక్షణ వలయాల ఏర్పాటుతో నదులు, కాలువలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు వంతెనల వద్ద ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. కెవిఆర్ కళాశాల, స్టాంటన్‌పురం, జొహరాపురం ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణలత, ఏఈ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ చెసిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

డోన్ : డోన్ పట్టణంలోని తారక రామ్ నగర్ ప్రాంతంలో రూ.31.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రెయిన్ల నిర్మాణ పనులకు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.డోన్ పట్టణంలోని ప్రతి ప్రాంతంలో అవసరమైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ డోన్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

# నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా

నంద్యాల : నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా -- 2026 కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసనగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు సఫాయిమిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శివిర్ కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ నిర్వహించడం జరిగింది. సఫాయిమిత్రలు ద్వారా వైద్యులు మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమంపై అవగాహన కల్పించడం జరిగింది. పారిశుధ్య నిర్వహణలో సఫాయిమిత్రలు అందిస్తున్న సేవలను గుర్తించి, వారి సేవలకు గౌరవం కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఈఈ, శానిటరీ సూపెర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, ఏఈ, సచివాలయ సిబ్బంది మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు లేని విద్యార్థినికి అండగా సైకిల్ అందజేత

పుట్టపర్తి రూరల్, : పాఠశాలకు వెళ్లేందుకు ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తున్న తల్లిదండ్రులు లేని విద్యార్థినికి మానవతా దృక్పథంతో సైకిల్ అందజేశారు. పుట్టపర్తి పట్టణంలోని తారకరామా కాలనీకి చెందిన శ్రావ్య చిన్నపల్లి జడ్పీహెచ్ హైస్కూల్‌లో చదువుతోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో పాఠశాలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఖిద్మత్-ఎ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుర్తించారు.ఈ విషయం తెలుసుకున్న గోపేపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన కదిరిసిని రమణమ్మ--కదిరిసిని సిద్ధయ్య దంపతుల కుమారుడు, ఆర్మీలో పనిచేస్తున్న కదిరిసిని వెంకటేష్ స్పందించారు. తన తల్లి కదిరిసిని రమణమ్మ జ్ఞాపకార్థం విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు.పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యశోద రాయుడు, కరణం సుబ్రహ్మణ్యేశ్వర, శేషు, హెచ్ఎం కె. వెంకటరమణ, పీడీ వి. సూర్యనారాయణ చేతుల మీదుగా శ్రావ్యకు సైకిల్ అందించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు షామీర్ మాట్లాడుతూ.. విద్యార్థిని ఇబ్బందిని తెలుసుకున్న వెంటనే స్పందించి సైకిల్ అందించేందుకు సహకరించిన వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతలు, సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో సాయి ప్రసాద్, షాకీర్, అశ్విని, నారాయణస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కదిరి మున్సిపాలిటీపై జేసీ సమగ్ర సమీక్ష

రూ.29 కోట్ల వీ పనులను వేగవంతం చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు: జేసీ మౌర్య భరద్వాజ్

కదిరి, : కదిరి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయడంతో పాటు పట్టణ పరిశుభ్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కదిరి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి హోదాలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, రెవెన్యూ తదితర విభాగాల పనితీరును జేసీ సమీక్షించారు. పట్టణంలోని పారిశుధ్య పనులపై ఆరా తీసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన అనుమతులు, రికార్డులను పరిశీలించిన జేసీ.. నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాల నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి, వీధి దీపాలు నిరంతరం వెలిగేలా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.